
# లోకానికి నేనే వెలుగు



## ఉపమానములు - వాటి పరమార్థం

సంపుటి : 47 జనవరి - మార్చి 2024 సంచిక : 1

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

## ప్రచురణ

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

### సంపాదక వర్గం :

ఫాదర్ పిల్లి అంతోని దాస్
ఫాదర్ కుర్మ తోమస్
ఫాదర్ సగినాల ప్రకాష్
ఫాదర్ దొడ్డ రాజా

### గురు విద్యార్థుల బృందం :

బ్రదర్ బాపనపాటి అలెక్స్
బ్రదర్ కండి కిషోర్
బ్రదర్ కోడిగంటి శౌరి నిఖిల్ తేజ
బ్రదర్ చాట్ల అలెగ్జాండర్
బ్రదర్ నెకూరి జాయ్ చందు
బ్రదర్ పెండేల ఉమేష్ చంద్ర
బ్రదర్ వంపుగుళ్ళ ప్రదీప్‌కుమార్
బ్రదర్ పచ్చిగొర్ల ఓబేజ్
బ్రదర్ పగుర్ల భానుప్రసాద్
బ్రదర్ పెంటారెడ్డి బాల సంజయ్
బ్రదర్ బడిపాటి జాకబ్
బ్రదర్ అరికోట్ల భరత్ కుమార్
బ్రదర్ బాలసాని ప్రభు దాస్
బ్రదర్ దొప్పలపూడి రవీంద్ర
బ్రదర్ గొన్నాబత్తుల హేమంత్

## చందా వివరములు

సంవత్సరానికి మీ చందాను రూ॥ 100/- యం.ఓ., డి.డి.ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్ముల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్:

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph: 91-040-29561761, 29561762
e-mail: stjohnshyd2@gmail.com

# లోకానికి నేనే వెలుగు

సంపుటి : 47 జనవరి–మార్చి 2024 సంచిక : 1

## ఉపమానములు - వాటి పరమార్థం

**ఫాదర్ సగినాల ప్రకాశ్**

సంచిక సంపాదకులు

**ఫాదర్ పిల్లి అంతోని దాస్**

ప్రధాన సంపాదకులు

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు–500 013.
ఫోన్ : 91-040-29561761, 29561762
E-mail : stjohnshyd2@gmail.com
Website : stjohnseminary.org

# విషయసూచిక


**సంపాదకీయం** ...................................................... **05**

**1. ద్రాక్షతోట – కూలీలు**

*– బ్రదర్ నందిగామ మణిహార్*.................................. **07**

**2. వితంతువు ప్రార్థన – న్యాయాధిపతి ప్రవర్తన**

*– బ్రదర్ మాదాను జోసఫ్* ......................................**13**

**3. దయచూపని సేవకుడు**

*– బ్రదర్ నెకూరి జాయ్ చందు*................................. **18**

**4. వివాహవిందు – పరలోక రాజ్యం**

*– బ్రదర్ మొలక విజయ్*........................................... **24**

**5. గోధుములు – కలుపుగింజలు**

*– బ్రదర్ బడిపాటి జాకబ్*....................................... **33**

**6. కరుణగల తండ్రి – దారి తప్పిన కుమారులు**

*– బ్రదర్ కొండెపోగు ప్రేమ్‌రాజ్*.................................**39**

**7. భూస్వామి – కౌలుదార్లు**

*– బ్రదర్ బొచ్చు అమరేందర్*.................................. **43**

**8. విత్తువాని ఉపమానము**

– *బ్రదర్ రుద్రపాటి ప్రవీణ్ కుమార్*.............................**50**

**9. ఇరుకు ద్వారం**

– *బ్రదర్ ఈరి పవన్ కుమార్*.................................. **55**

**10. లోభివాని ఉపమానము**

– *బ్రదర్ కొమ్మెర పవన్*.......................................... **60**

**11. అంజూరపు చెట్టు**

– *బ్రదర్ జుత్తుక వెళాంగని రాజ్*............................... **65**

**12. ఆవగింజ యొక్క ఉపమానం**

– *బ్రదర్ కసుకుర్తి జోసఫ్ తంబి*.................................**69**

❁ ❁ ❁ ❁

# సంపాదకీయం



కథలంటే ఇష్టపడని వారుంటారా! కథలంటే అందరికీ ఇష్టమే. సాయంకాలం భోజనం చేసి చల్లని గాలిలో వెన్నెల వెలుగుల మధ్య అందరూ కూర్చొని కథలు వినే సుందర ధృశ్యం పెద్దవారికి జ్ఞాపకం ఉండే ఉంటుంది. పిల్లలను, పెద్దలనూ అందరినీ ఒక చోట చేర్చి ఆనందంగా సమయం గడిపే క్షణాలవి. కథలలో ఎంతో నీతి ఉంటుంది. జీవిత పరమార్థాన్ని బోధించే అంశాలెన్నో ఉంటాయి. మొదట ఉత్సాహంగా మొదలుపెట్టి, చివరి సందేశంతో పూర్తయ్యే కథలు ఎన్నో విని ఉంటాం. గొప్ప వ్యక్తులు, కథలతోనే కమ్మని సందేశాన్ని అందజేశారు. అందుకే అవి చిరస్థాయిగా మనుషుల హృదయాల్లో నిలిచిపోయాయి.

యేసు క్రీస్తు ప్రభువు తన సందేశాన్ని కథల ద్వారా, ఉపమానాల ద్వారా వివరించాడు. అవి కూడా అతి సామాన్యుని జీవితం నుండి గ్రహించిన అంశాలే! వాటిని ఉపమానాలు అంటారు. ఉపమానం అంటే చెప్పదలచుకున్న విషయాన్ని ఒక పోలిక ద్వారా వివరించి చెప్పడం. అలా చెప్పిన నేపథ్యంలో చెప్పదలచుకొన్నది స్పష్టంగా అర్థం కావాలన్నదే అందులోని ప్రధాన ఉద్దేశ్యం. మనసులో ఉండే మాటను అవతలి వ్యక్తికి చెరవేయాడానికి “మాట” మాధ్యమం ఎంత ఉపయోగపడుతుందో, ఉపమానం కూడా, చెప్పదలచుకొన్న అంశాన్ని పోలిక ద్వారా అంతే గొప్పగా స్పష్టం చేస్తుంది. ఉదాహరణకు “అవసరంలోనున్న వ్యక్తికి సహాయం చేయండి. అతడు మీ వాడే కానవసరం లేదు. మీరు ఎంత నిష్టలో ఉన్నా, ఎన్నికట్టుబాట్లు మిమ్ము అవరోధించినా, అవసరంలో ఉన్న

పొరుగువాడు, మనిషి. కనుక మొదట అతనికి సాయం చేయటం మీ కనీస కర్తవ్యం.” ఈ మాటలు ఒక ప్రసంగరూపంలో చెప్పవచ్చు. కానీ వినేవారిని అంతగా అవి ఆకట్టుకోవు. అదే సారాంశాన్ని ప్రభువు మంచి సమరీయుని కథలో వివరించాడు. ఆ పోలిక చక్కగా సరిపోయింది. చెప్పదలచుకొన్న విషయం పాఠకులు హృదయాలను చేరింది. మంచి సమరీయుని ఉపమానం ప్రపంచంలో ఎవరైనా మరచిపోగలరా? ఇలాంటివి ప్రభువు ఎన్నో చెప్పాడు. అందులో కొన్ని ఈ సంచికలో పొందుపరచాం. గురు విద్యార్థులు తమకు లభ్యమయ్యే గ్రంథాలయం నుండి పుస్తకాలను, వ్యాసాలను ఎన్నుకొని ఈ రచనలు చేయడం జరిగింది. ఈ ఉపమానాల సారాంశం పాఠకులకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాము.

దైవాశీస్సులతో
**ఫాదర్ సగినాల ప్రకాశ్**
సంచిక సంపాదకులు

# 1. ద్రాక్షతోట - కూలీలు

- బ్రదర్ నందిగామ మణిహార్

## ఉపమాన పరిచయం



ద్రాక్షతోట - కూలీలు ఉపమానం మత్తయి సువార్తలో తప్ప మరి ఏ ఇతర సువిశేష గ్రంథాలలో కనిపించదు. ఈ ఉపమానమును క్షుణ్ణంగా పరిశీలించినచో దైవరాజ్య సంబంధమైన ఉపమానాలను పోలి ఉన్నట్లు గమనించవచ్చు. ద్రాక్షతోట ఉపమానాలు యెషయా ప్రవక్తకాలం నుండి ఉన్నప్పటికినీ ఈ (ద్రాక్షతోటలో - కూలీలు) ఉపమానంలోని స్థితిగతులు పాలస్తీనా స్థితిగతులకు అనుగుణంగా ఉన్నాయి. పాలస్తీనా దేశంలో నిరుద్యోగం, యజమాని పనివారిని పనికి పిలవడం, రోజుకు ఒక దీనారం చొప్పున ఇవ్వటం సర్వసాధారణమే. కాని ఉపమానంలో యజమాని కూలివారు చేసిన పనిని గాని లేక వారు చేసే పని సమయాన్ని గాని లెక్కింపక అందరికీ ఒకే విధమైన వేతనం ఇవ్వటం గమనించదగ్గ విషయం. వేతనం యజమాని దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది.

అదే విధంగా క్రీస్తు ప్రభువు ఈ ఉపమానం ద్వారా మానవులపై దేవునికి ఉన్న అమితమైన ప్రేమను సూచిస్తూ, ఆయన దయా, కనికారాలు మన వేడుదలనను సరించి మాత్రమే కాకుండ అతని దైవ అనుగ్రహం వలన కూడ అందరిపై సమానంగా ఉండునని తెలియజేస్తున్నారు.

## ఉపమాన చరిత్ర

ద్రాక్షతోట - కూలీలు మనము క్షుణ్ణంగా పరిశీలించినచో కూలీ ఇచ్చు విధానం తప్ప అన్ని సందర్భాలు, పాలస్తీన సామాజిక పరిస్థితులను పోలి

ఉంటుంది. అనగా పాలస్తీన దేశములో సెప్టెంబర్ ఆఖరి రోజులలో ద్రాక్షతోటలు పరిపక్వానికి వస్తాయి. అదే సమయంలోనే వర్షాలు ఎక్కువగా కురుస్తుంటాయి. కావున చాలా వరకు ఆ పంట నాశనం కాకుండుటకు తోట యాజమాని కూలీలకై వెళ్ళి కూలి వారిని తెచ్చి పంట కోయించేవారు. మరియు వారికి తగిన వేతనాన్ని ఇచ్చేవారు. ఇటువంటి విషయాలు అనాటి ప్రజలకు తెలుసు కాబట్టి క్రీస్తు ప్రభువు ఈ విషయాలను తన ఉపమానాలలో పొందుపరిచి శిష్యులకు బోధించారు. పాత నిబంధనలో మరియు నూతననిబంధనలో ప్రవక్తలు, క్రీస్తు ప్రభువు అనాటి సమాజాన్ని ప్రజలను ద్రాక్షతోటతో పోల్చి దేవుని సందేశం ప్రజలకు అందించేవారు (యెషయా 5:1-7;27:2-5). అదే భావాన్ని నూతన నిబంధనంలో మత్తయి 21:28-30, మార్కు 12:1-18 వచనాలలో చూడవచ్చు.

## ఉపమానం యొక్క ఉద్దేశము

ఈ ఉపమానానికి ముందు అధ్యాయాలన్ని గమనించినచో క్రీస్తు ప్రభువు పలుచోట్ల, పలుమార్లు పాపులను, సుంకరులను ఆదరించారు. అందుకు వ్యతిరేకంగా యూదులు, పరిసయ్యులు క్రీస్తు ప్రభువును ఎదురించారు. ఈ ప్రతిఘటనలను అణచివేయుటకు క్రీస్తు ఈ ఉపమానాన్ని బోధించారు.

క్రీస్తు సువార్త పరిచర్యకాలంలో యూదులు, పరిసయ్యాలు బోధకులుగా ఉండేవారు. వారు చెప్పిందే వేదంగా అందరు భావించేవారు. ఎందుకంటేవారు దేవుని వలన ఎన్నుకోనబడిన వారుగా, వారు దేవుని నుండి నేరుగా ఆజ్ఞలను పొందినవారుగా, వారు మాత్రమే దైవరాజ్య అర్హతను పొందిన వారిగా అందరూ భావించారు. క్రీస్తు ప్రభువు "ద్రాక్షతోట - కూలీలు" అనే ఉపమానం ద్వారా యూదులకు, పరిసయ్యులకు ఒక పాఠం నేర్పదలచారు. దైవరాజ్య అనుగ్రహం దేవుని దైవానుగ్రహమే! దైవరాజ్యం ఒక్క పరిసయులకూ, యూదులకు మాత్రమే కాకుండా దేవుని నమ్మి, ఆయనను అనుసరించి, ఆజ్ఞలను పాటించు వారందరికీ అనుగ్రహించబడును," అని తెలియచేయడామే ఈ ఉపమాన ఉద్దేశం.

## ఈ ఉపమానము పరలోక రాజ్యమును పోలియున్నది

పరలోక రాజ్యము సువార్త గ్రంథ పఠనాలలో క్రీస్తు ప్రభువు సందేశాన్ని పరిశీలించినచో "పరలోక రాజ్యమును" ముఖ్యమైన అంశముగా తన సువార్తలో ప్రకటించారు. పాతనిబంధనలో పరలోకరాజ్యం అనగా యావే దేవుని రాజ్యాధికారం అని లేదా పాలనాధికారమని వర్ణించబడింది పూర్వవేదంలో పరలోక రాజ్యం ప్రత్యక్షంగా కనిపించకపోయినా ఆ అర్థాన్ని అందించే ఇతర వాక్యాలను ఉపయోగించారు. అంతేకాకుండ కీర్తన 103:19; 145:11-13లో ప్రభువు రాజ్యమున ఘనత, ప్రభావం గౌరవం కలిగి ఉండును అని వర్ణించారు. క్రీస్తు ప్రభువు సువార్తను బోధించునపుడు పరలోక రాజ్యన్ని సూచించుటకు ఉపమాన రీతిలో ప్రబోధించారు. ఇలా బోధించిన ఉపమానాలలో 'ద్రాక్షతోట-కూలీలు' ఉపమానం ఒకటి. పరలోకరాజ్యం అంటే ధర్మాధర్మ నిర్ణయాలకు అనుగుణంగా ప్రభువు తన రాజ్యాన్ని ప్రజల మధ్యనే ఇహలోకంలోనే శాంతి, సమాధానాలతో స్థాపించడమే పరలోకరాజ్యం అని వర్ణించబడింది. అయితే ఈ ఉపమానంలో దైవరాజ్యం లేదా పరలోక రాజ్యాన్ని ఇంటి యాజమానితో పొల్చి చెప్పబడలేదు.

## దినమునకు ఒక దినారము చొప్పున ఇచ్చెడి వారు

రోమా సామ్రాజ్య ఆచారం ప్రకారం కూలి వానికి దినానికి ఒక దినారం చెల్లించెడివారు. అనగా 'దినారం'తో ఒక రోజుకు సరిపడ సరుకులు వచ్చేవి. వాటితో జీవనం గడుపవచ్చును. పాలస్తీన దేశస్థులు రోమా సామ్రాజ్య పరిస్థితులకు ప్రభావితులై ఉండటం వలన, రోమీయులు వారిని పాలించటం వలన రోమీయుల ఆచారాలను అలవరచుకొన్న వీరు కూడా దినానికి ఒక దినారం చొప్పున కూలి ఇచ్చెడివారు. క్రీస్తు ప్రభువు ఎందుకు దినారం అనుపదం ఉపయోగించారు అని మనం గమనించినట్లయితే, అక్కడ రెండు విషయాలును గమనించువచ్చు. "దినారం" లౌకిక పరమైన బలహుమానాన్ని సూచిస్తుంది. మరియు దినారం పరలోక రాజ్యంలో మనకు దొరికే నిత్య జీవాన్ని కూడా సూచిస్తుంది. అయితే ఇహలోక పరమైన బహుమానానికి ఆరాటపడువారు నిత్య జీవితాన్ని కోల్పోతారు. అంతేకాకుండ మనకు ఒసగబడిన నిత్యజీవితం

కూడా మన యోగ్యత, అర్హతను బట్టి కాకుండ దేవుని అమూల్యమైన దైవానుగ్రహం వలననే లభించును, అని క్రీస్తు ప్రభువు ఈ ఉపమానం ద్వారా తెలియజేస్తున్నారు.

## పండ్రెండు గంటలకు, మూడు గంటలకు ఐదు గంటలకు

రోమా సామ్రాజ్యమున ఒక రోజుకాలాన్ని నాలుగు గడియలుగా విభజించి, ఒక్కొక్క గడియకు మూడు గంటల చొప్పున విభజించారు. మరియు అదే కాలమాన పట్టికను కూడా యూదులు పాటించెడివారు. అయితే యూదుల రోజు ఆరంభం ఉదయం ఆరు గంటకు ప్రారంభమై సాయంత్రం ఆరుగంటలకు ముగుస్తుంది. ఉపమానంలో మూడు గంటలనీ, తొమ్మిది గంటలనీ, ఆరు గంటలకు పండ్రెండు గంటలనీ ఉంది. పదకొండు గంటలకు సాయంకాలం ఐదుగంటనీ అర్థం. క్రీస్తు ప్రభువు పాలస్తీన దేశంలోని ఆచారపు అలవాట్లు ఎరిగి ఉండుటచే పాలస్తీన పకృతి పరిస్థితులకు అనుగుణంగా యూదులకు అర్థమయ్యే పదాలను ఉపయోగించి ఉపమానాన్ని చెప్పారు.

## మమ్మెవ్వరూ కూలికి పిలువలేదు

మమ్మెవ్వరూ కూలికి పిలువలేదు అనే ఈ వాక్యం అర్థం చేసుకోవడం చాలా కష్టం కాని, ఈ ఉపమానంలో జాగ్రత్తగా పరిశీలించినచో మనకు ఒక సందేహం రావచ్చు. యజమానికి కావలసిన కూలీలను ఒక్కసారి పిలుచుకోవచ్చు కదా? మరి ఎందుకు పిలువలేదు. దీనికి క్రీస్తు ఎందుకు ఈ విధంగా చెప్పారు, అంటే వేరు వేరు సమాయాలలో వచ్చి పని చేసిన వారి మధ్య భేదాన్ని చూపించకుండ, అందరికీ ఒక విధమైన రోజువారి వేతనం ఇవ్వటం సూచించుటకు అట్లు చెప్పారు. అంతేకాకుండ కూలి ఇచ్చునపుడు చివరి నుంచి ప్రారంభించి. మొదటి వచ్చిన వారు కూడా సమాన వేతనం పొందుకున్నారు. అలాగే దేవుని కృపావరాలు, ప్రేమ అందరిపై ఒక్కలాగా ఉంటాయి అని చెప్పడం కోసం ఈ ఉపమానం అలాగా చెప్పబడింది.

ఈ ఉపమానం ద్వారా అనేక పాఠాలను నేర్చుకోవచ్చు. ప్రభువైన దేవుడు తన చిత్తాను సారంగా తన ఇష్టమైన వారికి తన అమూల్యమైన వరాలను ప్రసాదించు స్వేచ్ఛను కలిగి ఉన్నారు. దేవుడు సంపూర్ణ స్వేచ్ఛాపరుడు. కావున

తనను అనుసరించుచూ ఆజ్ఞలను పాటించుచూ ఆయన నిమిత్తం అన్ని వదలుకొనిన వారికి తన దైవరాజ్యన్ని అనుగ్రహంగా ప్రసాదిస్తారు. అవిధంగా దైవానుగ్రహం ఒక్కజాతి ప్రజలకు మాత్రమే కాకుండ అందరికీ ప్రసాదించారు. మరియు ప్రభు రాజ్యంలో పేద, గొప్ప, జాతి తారతమ్యం లేకుండా అందరినీ క్రీస్తు ప్రభువు ద్వారా పరలోక రాజ్యంలో వారసులుగా చేయట ప్రభువు సంకల్పం.

ఉపమానంలో మొదట వెళ్ళిన వారిని యూదులుగా పోల్చవచ్చు. చివరి గంటలో వెళ్లినవారు సుంకరులు, పాపులు అన్యులుగా పోల్చవచ్చు. మరి వేరు వేరు గడియాలో పిలువబడిన వారు, వేరు వేరు ప్రాంతాలను, జాతుల నుండి పిలువబడిన వారుగా చూడవచ్చు. ఏ సమయంలో ప్రభువు పిలుపు వస్తుందో తెలియదు కావున మనం ఎల్లప్పుడు ప్రభు చిత్తానుసారంగా జీవించాలి.

**ముగింపు**

మానవుని మేధా సంపత్తితో ప్రభువు ధర్మాధర్మములను, అతని ప్రేమను కొలువజాలం. దేవుని ప్రేమ గొప్పది. ఆ ప్రేమ వలననే ప్రతి ఒక్కరికీ ఆయన తన నిత్యజీవాన్ని ప్రసాదించుటకు దేవుడు తన ఏకైక కుమారుని ఈ లోకమునకు పంపెను. ఆ నిత్యజీవాన్ని పొందుటకు ప్రభువు మానవునికి తన ద్రాక్షతోటలో పనిని అప్పగించును. ఆ పనిని నేరవేర్చుటకు ప్రభువే తన అనంతమైన ప్రేమచేత తన దైవ అనుగ్రహవరాలతో అన్నీ సమకూర్చారు. కావున ఆయన అనంతమైన కృప వలనే అవి అనుగ్రహింపబడును.

సత్య తిరుసభ అనే ద్రాక్షతోటలో పనివారంగా పిలువబడిన మనం దేవుని యొక్క ప్రేమపై విశ్వాసంతో జ్ఞానస్నానం పొంది, ఆయన ప్రియమైన దైవరాజ్య వారసులం గావించబడ్డాం. ద్రాక్షతోటలో దైవచిత్తాను సారంగా జీవిస్తూ దైవానుగ్రహానికి సహకరిస్తే లోకాంత్యాన తప్పక పరలోక రాజ్యాన్ని పొందగలం. మనలో ఇంకా కొంతమంది మేం ఆది క్రైస్తవులం లేదా పుట్టు క్రైస్తవులం, మేం మాత్రమే పరలోకరాజ్యాన్ని చేరుతాం అనే యూదా ప్రజల అపోహాలోనే జీవిస్తున్నారు. అలా కాకుండ క్రీస్తును నమ్మి, విశ్వసించు ప్రతి ఒక్కరు పరలోక రాజ్యాన్ని పొందుతారు.

కావున మనం లౌకికపరమైన వ్యామోహాలను విడనాడి ప్రభువువైపు మన దృష్టినిసారించి మనకు ఉన్నదానితో సంతృప్తిపొంది మనకు ఉన్నదానికి మనతోటి సహోదరునితో పంచుకొని క్రీస్తులో జీవిస్తూ మనం చేయుకార్యలన్నీ దేవుని మహిమ పరచుకార్యాలుగా ఉన్నచో పరలోక రాజ్యం అందరికీ ప్రాప్తిస్తుంది. ఇది, ఈ ఉపమానం ద్వారా ప్రభువు మనకు ఇచ్చే సందేశం.

# 2. వితంతువు ప్రార్థన - న్యాయాధిపతి ప్రవర్తన

- బ్రదర్ మాదాను జోసఫ్

## ఉపోద్ఘాతం



విశ్వాసాన్ని సజీవంగా ఉంచేది పట్టుదలతో కూడిన ప్రార్థన. పట్టుదల అంటే ఒక విషయం కోసం ఒక వారం రోజులు ప్రార్థించిన తరువాత అది నేరవేరకపోతే ఇది దేవుని చిత్తం కాదు అని వదిలివేయడం లేక మనం అడిగిన విషయం ముఖ్యమైనది కాబట్టి దాని కోసం వారాలు, నెలలు, సంవత్సరాలు తరబడి ప్రార్థించినా అది నేరవేరకపోతే వదిలివేయడం కాదు. పట్టుదలతో కూడిన ప్రార్థన అనేది ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, నిరాశ చెందక విజయం సాధించే వరకు చేపట్టిన కార్యాన్ని కొనసాగించడం (రోమీ 12:12).

లూకా సువార్తా 18:1-8 లో వితంతు ప్రార్థన, న్యాయాధిపతి ప్రవర్తన అను ఉపమానం ద్వారా యేసుక్రీస్తు రాబోవు ఉపద్రవాలను గురించి హెచరించుచు దైవారాజ్య ప్రాప్తికై విశ్వాసం కోల్పోకుండా, నిరుత్సహపడకుండా నిరంతరం ప్రార్థన చేయ్యాలని బోధిస్తున్నారు.

## చారిత్రాత్మకత

ఉపమానం పూర్తి అర్థం గ్రహించాలి అంటే అది ఏ పరిస్థితులలో ఎవరిని ఉద్దేశించి చెప్పబడిందో గ్రహించాలి. పాలస్తీనా యూదా సంఘంలో ప్రతి వర్గానికి స్థానముంది. ఈ స్థానాలు హెచ్చుతగ్గులతో నిండియున్నాయి. న్యాయాధిపతి, పరిసయ్యులు, విధవరాండ్రు, సుంకరులు మొదలగు కొన్ని వర్గాలున్నయి. ఈ వర్గాలలో విధవరాండ్రు అనాధలు పరదేశీయులు ఒక

ప్రత్యేక వర్గంగా వుంటారు. వీరికి ప్రత్యేకమైన భద్రత అవసరం. అందుకే దేవుడు విధవరాండ్రకు అదరవు కర్త అని కీర్తనలు గ్రంథం పలుకుతుంది (కీర్తన 68:5).

వితంతు ప్రార్థన – న్యాయాధిపతి ప్రవర్తన ఉపమానంలో రాబోయే కాలం సంఘటనల పరిధిలో నుండి చూస్తే దాని పూర్తి అర్థాన్ని గుర్తించగలుతాం. పరిసయ్యులు దైవరాజ్యం ఎప్పుడు వస్తుందని క్రీస్తును సూటిగా అడిగారు (లూకా 17:20). ఆగమనం దైవరాజ్య దైవకుమారుని ఆగమనంతో ముడిపడివుంది. దైవరాజ్య ఆగమనం కొరకు మనలను సిద్ధం చేసుకుంటుండాలి. ఎల్లవేళలా ప్రార్థన చేస్తూ, నిరుత్సాహపడకుండా వుండాలి (లూకా 18:1) అని క్రీస్తు ప్రభువు శిష్యులకు బోధించాడు. దైవకుమారుని రాబోయే దినాలు నిరంతర ప్రార్థనలు, ఓపికను కోరతాయి. దైవరాజ్య ఆగమనం విశ్వాసుల విశ్వాసాన్ని కోరుతుంది. ప్రార్థనలో సరైన దృక్పథం వుండాలి (లూకా 11:9-14). పసిబిడ్డల మన స్తత్వం కలిగి దేవునికి అంగీకారమైన జీవితం జీవించాలని యేసుక్రీస్తు శిష్యులకు ఈ ఉపమానం ద్వారా తెలియపరుస్తున్నారు.

## ఉపమాన వివరణ

ఈ ఉపమానంలో రెండు ప్రధాన పాత్రలన్నాయి: న్యాయాధిపతి, విధవరాలు. సమాజంలోని వ్యత్యాసాలను ఈ రెండు పాత్రలు నాటి సాంఘిక పరిస్థితులను తెలుపుతాయి.

న్యాయాధిపతి పట్టణంలో పేరు పొందిన వ్యక్తి. అనగా సామాన్య ప్రజలకు దూరంగా ఉండేవాడు. అతను దేవునికి భయపడడు, మనుషులకు అదరడు. దైవభీతిని చూపలేక పోవడం, మానవులకు భయపడక పోవడం అనేది అతను సంపాదించుకున్న స్థానం, పరపతి వలన వచ్చింది. అయితే పరపతులు, స్థానాలు మనుష్యుల అహంకారాన్ని పెంచుతాయి కాని ఆ వ్యక్తి గొప్పతనాన్ని చూపవు అతని నీచబుద్ధిని చూపుతాయి.

ప్రాచీన యూదయ సంఘంలో స్వతంత్రంగా వుండే స్త్రీ అంటూ ఎవరూ వుండేవారు కాదు. ప్రతి స్త్రీ తండ్రి మీదనో లేదా భర్త మిదనో ఆధారపడి వుండేవారు. అట్టి సమయాల్లో విధవరాండ్ర పరిస్థితి చాలా క్లిష్టంగా ఉండేది

విధవరాండ్రుకు అస్తి అంటూ ఉండదు. పెద్ద కుమారుని ఆస్తిలో భాగముండేది. సంతానం లేకుంటే తండ్రి ఇంటికి వెళ్లేవారు (రూతు 1:8). మగదిక్కు లేని విధవరాండ్రు వేధింపులకూ, అన్యాయానికి గురి అయ్యేవారు (యోబు 24:3). విధవరాండ్ర తరపున వాధించే న్యాయవాదులుండరు. కావున వారు అవినీతిపరులైన న్యాయావాధి దయ దాక్షిణ్యాల మీద ఆధారాపడి ఉంటారు (యెషయా 10:2, లూకా 18:3).

ఇట్టి సమాజ స్థితిలో వున్న కడు పేదరాలు, ఈ ఉపమానంలోని విధవరాలు. న్యాయాధిపతిని పలుమార్లు వేడుకొన్నది. విధవరాలు విన్నపం తనకు న్యాయము జరగాలని మాత్రమే తప్ప, తన ప్రత్యర్థిపై పగతీర్చుకోమని బ్రతిమాలుట లేదు. ఆమె విన్నపము న్యాయమైంది అందుకే ఆమె విన్నపం స్వార్థరహితమైంది. విధవరాలు తరచూరావడం బ్రతిమాబటం న్యాధిపతిని అసౌకర్యన్ని గురిచేసింది. విధవరాలు పదే పదే ప్రాధేయపడడంతో న్యాయమూర్తికి బాధ్యత గుర్తుకొచ్చింది. ఎవ్వరినీ పట్టించుకోని న్యాయముర్తిని విధవరాలి ఎడతెగని విన్నపాన్ని మన్నించాల్సి వచ్చింది. చివరకు ఆమె విన్నపం నెరవేర్చబడింది.

ఎడతెగని ఆలాపన ఒక అన్యాయమూర్తి కఠిన హృదయాన్ని మార్చివేసినచో దేవుని రూపురేఖలలో సృష్టించబడిన దేవుని బిడ్డలమైన మనం రేయింబవళ్లు మొరపెట్టుకొనిన దేవుడు మన ప్రార్థనలకు న్యాయం చేయకుండ ఉండునా? తనయందు భక్తి విశ్వాసముతో ప్రార్థించినచో దేవుడు మన ప్రార్థనలను తప్పక ఆలకిస్తాడు. అతడు మనకు న్యాయం చేకూర్చే దేవుడు.

## పరిశుద్ధ గ్రంథ ప్రార్థన సంఘటనలు

ఆదికాండము 18:20-32లో అబ్రహాము యావేను పట్టుదలతో ప్రార్థించిన ఉదంతన్ని తెలియపరుస్తుంది. అబ్రహాము యావేనందు అచంచలమైన విశ్వాసం కలిగి ఉన్నవాడు. అబ్రహాము తన చుట్టు ప్రక్కల జీవించేవారి రక్షణయందు ఆసక్తిని మెండుగా కనబరిచాడు. వారిని శిక్షించవద్దని దేవుని అకుంఠిత దీక్షతో వేడుకున్నాడు. సోదోము గోమొర్రా పట్టణ ప్రజలను నాశనం చేయ సంకల్పించి, దేవుడు దిగివచ్చినపుడు అబ్రహాము ఆపట్టణ

ప్రజలను, కొద్దిమంది నీతిమంతుల కోసమై రక్షించమని ప్రాధేయపడిన విధానం అబ్రహాముకు ఆ ప్రజల రక్షణ పట్ల ఉన్న ఆసక్తిని వ్యక్తం చేస్తుంది. ఏబది మంది నీతిమంతుల నుండి పదిమంది వరకు ఉన్నా ఫరవాలేదు నీ ప్రార్థనను ఆలకిస్తాను, అన్నంత వరకు దేవుని ఒప్పించగలిగిన విశ్వాసం, పట్టుదలతో కూడిన ప్రార్థన ఆయనది.

లూకా 11:5-13 లో ఒకడు అర్థరాత్రి తన మిత్రుని దగ్గరకు వెళ్ళి వేరొక మిత్రుని కొరకు మూడు రొట్టెలు బదులు ఇవ్వమని అడిగినప్పుడు అతడు మొదట ఇవ్వటానికి నిరాకరించినా, తరువాత అతడు పదే పదే ప్రాధేయపడినందున లేచి అతని అవసరమును తీరుస్తాడు. అదే విధంగా మనం కూడ మన దేవుని నమ్మకంతో, పట్టుదలతో ప్రార్థిస్తే ఆయన మనకు అన్నీ సమకూరుస్తాడు.

కావున లూకా 11:1-4 లో యేసు ప్రభువు తన శిష్యులకు ప్రార్థన నేర్పిన విధముగా మనం కూడా పట్టుదలతో ప్రార్థించే శక్తిని, ఓర్పును దయచేయమని దేవుని నిరంతరం విశ్వాసంతో అడుగుకోవాలి.

## ఉపమాన అన్యాయం

ఉపమానంలోని ముఖ్య ఉద్దేశం ఎడతెగని ప్రార్థన. ఎటువంటి దీన పరిస్థితులైనా, క్లిష్ట పరిస్థితులు ఎదురైనా కూడా దేవునితో సంబంధ బాంధవ్యాలను పెంపొందించుకోవాలి. అందుకు కష్టాలను, అన్యాయపు సంఘటలను, నిరాశలను, చిత్రహింసలను ప్రార్థన ద్వారా తండ్రి దేవునికి క్రీస్తు ద్వారా విన్నవించుకోవాలి. బాధలను కూడ స్వీకరించటానికి దైవశక్తి అవసరం. ఆ వరాలు లభించే స్థానం కూడ ప్రార్థనయే.

ప్రార్థన అనగా మనస్సును, మేధస్సును దేవుని వైపు మళ్లించుటయే. ప్రార్థనలో మనిషి దేవుని సమక్షంలో నిజంగా భిక్షగాడు. కష్టాలు కడగండ్లు మనిషిని ఇంకా దేవుని దగ్గరకు చేర్చుతాయి. ప్రార్థనలో సంపూర్ణ హృదయం ఇమిడి ఉండాలితప్ప మాటలు, సంజ్ఞలు ఉండినచో, అంతవృధాయే!

విధవరాలు విన్నపంలోని ప్రధానాంశాలు ఏమనగా నిరంతరం వేడుకోవటం. సహనంతో, విశ్వాసంతో న్యాయమూర్తి తనకు న్యాయము చేస్తాడని

నమ్మింది. అమె విన్నపం సరియైనది. తన ప్రత్యర్థి నాశనాన్ని కోరుకోలేదు, లంచం ఇవ్వలేదు. కాని న్యాయం జరగాలని విన్నవించుకుంది. అదే విధంగా మన ప్రార్థన స్వార్థపూరితమై ఉండకూడదు. మన విన్నపం దైవప్రణాళికకు అనుగుణంగా, సరిమైనది అయ్యి ఉండాలని ప్రతి క్రైస్తవుడు నేర్చుకోవాలి.

**ముగింపు**

ఉపమానంలోని దీన పరిస్థితి, న్యాయం పొందటం వంటి అంశాలను క్రీస్తు తన శిష్యులకు ఓదార్పు బోధలుగా అందించాడు. విధవరాలి పరిస్థితిలాగ ఉన్న యూదా ప్రజలు దేవుని రాజ్యం కొరకు నిరంతరం ఎదురుచూసారు. వారికి ఎదురైంది నిరాశ, చిత్రహింసలు మాత్రమే. దేవుని మీద దృఢవిశ్వాసంతో ఓపిక నశించకుండా నిరంతరం ప్రార్థించాలి. విధవరాలిలా విజయం సాధించాలి.

దేవుని మీద ఆధారపడి వుంటూ నిత్యం ప్రార్థనలో జీవనం సాగించే వారికి విశ్వాస జీవితంలో కొరత, అంసతృప్తి అంటూ వుండవు. కష్టాలు క్షణికం దేవుని ప్రేమ ఎంతటి అగాధాలనైనా దాటించగలదు. ఎన్నికష్టాలనైన భరించే శక్తి ఇవ్వగలదు. నిరంతర ప్రార్థన ద్వారా దేవుని హస్తం ఎల్లపుడు మనపై ఉంటుంది. మనలను సకల ఆపదల నుండి రక్షిస్తుంది. క్రీస్తు తన శిష్యుల నుండి కోరేది కూడా ఇదే. ఆవిధంగా జీవించేవాడు అంతిమదినం ఏనాడు వచ్చినా సిద్ధంగా ఉంటాడు. దేవుడు ఇచ్చే ప్రతి ఫలాన్ని సంపూర్ణ హృదయంతో అంగీకరిస్తాడు.

# 3. దయచూపని సేవకుడు

**- బ్రదర్ నేకూరి జాయ్ చందు**

## ఉపమాన పరిచయం



పునీత పదవ పయస్ జగద్గురువు మాంటువా మేత్రాసనానికి పీఠాధిపతిగా ఉన్న రోజుల్లో ఒక వర్తకుడు దివాలా తీసాడు. అప్పుడు పునీతుడు తనకు బాగా తెలిసిన కతోలికుని పిలిచి, కొంత సొమ్ము నిచ్చి, వర్తకునికి అందచేయమన్నాడు. అందుకు ఆ కతోలికుడు, "ఆ మనిషి మీ గురించి గోడచాటున చెడుగా మాట్లాడుతాడు" అని చెప్పగా, భౌష్య జగద్గురువు, "అందుకే నీ ద్వారా అందిస్తున్నాను. అతని చాటుమాటు మాటల్లా ఈ సాయం కూడ చాటుగా ఇస్తున్నాను" అని అన్నాడు.

సర్వ సామాన్యమైన పాపం ఏమిటని ప్రశ్నిస్తే, చాలా మంది చేప్పే జావాబు, నైతిక విలువలకు వ్యతిరేకంగా కట్టుకున్న పాపాలేనని. కాని మనం ఎక్కువగా చేసే పాపాలేవంటే మనకు ద్రోహం చేసిన వారిని మన్నించకపోవటం. బైబిల్లో మన్నింపు గురించే ఎక్కువగా ఉంటుంది. ఓ రకంగా మనం వందనాలు చెప్పుకోవాలి. ఎందుకంటే, అలా లేకపోతే ఈనాటి ఉపమానం ఉండేది కాదేమో?

ఈ ఆధునిక యుగంలో జీవిస్తున్న మానవుడు కక్ష, శిక్ష, అనే మార్గాలతో పయనిస్తూ వున్నాడు. అయితే ఈ రెండు మార్గాల మధ్యవున్న క్షమ అనే మార్గాన్ని మరచిపోతున్నాడు. కక్ష, శిక్ష మనిషి ప్రాణాన్ని తీస్తే, క్షమ ప్రాణాన్ని నింపుతుంది. ఆదిలో దేవుడు తన ఆకారంలో తన సొంత ఊపిరితో జీవిస్తున్న మానవున్ని చూసి సంతసించాడు. అయితే ఈ నవ్య ప్రపంచంలో మానవుడు

తన మాదిరి, తనతో పాటు జీవిస్తున్న మానవున్ని చూసి అసహ్యించుకుంటూ కక్ష సాధింపుతో జీవిస్తున్నాడు. ప్రతి మానవుడు కూడా కక్ష, శిక్షలలోనే పెరుగుతున్నాడు. దానికోసమే తమ జీవితాన్ని పూర్తిగా అర్పించుకొంటున్నాడు. ఈ కక్ష, శిక్ష, ప్రతి ఒక్కరినీ పక్షవాత రోగంలాగా పీడిస్తున్నాయి. ఈ రోగానికి క్షమ వైద్యం, నైవేద్యం లాంటిదని మరచిపోతున్నారు. అందుకే కరుణామయుడైన క్రీస్తు క్షమ విలువను దాని అర్థాన్ని ఈ లోకానికి రుచి చూపటానికి ఈ లోకాన అవతరించారు.

పాపం చేయడం మానవుని సహజగుణమైతే, చేసిన పాపాన్ని క్షమించడం దేవుని నైజం. ప్రతి నిత్యమూ, ప్రతిక్షణమూ మానవుడు పాపపు ఆలోచనలతో, క్రియలతో జీవిస్తూ వుంటే, దేవుడు కూడా ప్రతినిత్యమూ, ప్రతిక్షణమూ క్షమిస్తూనే వున్నాడు. ఎందుకంటే ప్రతి మానవుడు క్షమను రుచిచూడాలని, ఒకరిపట్ల ఒకరు క్షమా భావంతో పెరుగుతూ వుండాలని దేవుడు ప్రతి ఒక్కరిని సమపాలనముతో చూస్తూ పాపం చేసినప్పుడల్లా క్షమిస్తూనే వున్నాడు.

ఈ క్షమాపణ ఒక ఊట లాంటిది. మనం ఆ ఆనంద ఊట అనుభూతిని పొందాలంటే "క్షమాపణ" గుణంతో పరస్పరం అంగీకరించాలి. సంఘ స్థాపనకు ఇది పునాది. విభేదాలను తొలగించి, విధ్వంసాలను రూపుమాపి ఒక సమాజమును నిర్మించగలిగేది, నిలబెట్టగలిగేది, నడిపించ గలిగేది ఈ పరస్పర క్షమాపణ మాత్రమే. "క్షమించండి" అని పలికిన ప్రభువునే ఎన్నిమార్లు క్షమిస్తే సరిపోతుందని అని అడిగితే ప్రభువు జీవితాంతం క్షమించమని చెప్పడంలోనే ప్రభుని గొప్పతనం కనబడుతుంది. ఈ ఉపమానం పరస్పరం క్షమకలిగి జీవించమని చెబుతూవుంది.

## ఉపమాన చారిత్రకత

ఈ ఉపమానాన్ని మత్తయి సువార్తాలో మాత్రమే చూస్తూ వున్నాం. మార్కు లూకా సువార్తలలో ఈ ఉపమానం మనకు కనబడదు. అయినా కాని ఉపమానంలోని ప్రధాన భావం మార్కు, లూకా సువార్తల్లోను చూడవచ్చు.

పునీత పేతురు క్రీస్తు ప్రేమించిన శిష్యులలో ఒకడు. అందుకే సువార్తలలో ప్రభువు కొద్దిమంది శిష్యులతో కొండ ప్రాంతానికి ప్రార్థనకు పోయినప్పుడు,

ఆ కొద్దిమందిలో పేతురును మనం చూడవచ్చు. ముఖ్యముగా దివ్యరూప ధారణయందూ, గెత్సమని తోటలో ప్రభువు ప్రార్థనకు పోయినప్పుడు కూడ మనం ఈ పేతురును చూడవచ్చు. క్రీస్తు పేతురును, పేతురు క్రీస్తును ప్రేమించారు.

పునీత పేతురు యూదయ సమాజంలో జన్మించాడు. యూదయా సంప్రదాయాన్ని ఎక్కువ తెలిసిన వ్యక్తి. కావున యూదా సంప్రదాయ ప్రకారం ద్రోహం చేసిన వ్యక్తిని మూడుసార్లు మాత్రమే క్షమించాలి. యూదా మత పెద్ద Jose Ben Hanina ప్రకారం ఏ వ్యక్తియైన మూడుసార్లు కంటే ఎక్కువ క్షమాపణను పొందలేడు. ద్రోహము చేసిన వ్యక్తిని మూడుసార్లు మాత్రమే క్షమించాలి. అంతకంటే ఎక్కువసార్లు క్షమించవద్దు. యూదయా సంప్రదాయ ప్రకారం మూడుసార్లు కంటే ఎక్కువగా క్షమించడం నేరమే. అందుకే యూదులు దీనిని ఖచ్చితంగా పాటించేవారు.

## ఉపమాన ఉద్దేశం

యూదా సాంప్రదాయ ప్రకారం మూడుసార్లు తన సహోదరులను క్షమించాలి. అంతకంటే ఎక్కువగా క్షమించడం నేరం. మరోప్రక్క క్రీస్తు ప్రభువు "నీ వలె నీ పొరుగువారిని ప్రేమింపుము, ద్రోహము చేసిన యెడల అతనిని క్షమింపుము" అని పలికిన ప్రభువు పలుకులకు పునీత పేతురుగారు కలతచెంది, మూడును రెట్టింపు చేసి ఆరుకు ఒకటిని జతచేసి ప్రభువును ప్రశ్నించాడు. నా సహోదరుడు ద్రోహము చేసిన యెడల ఎన్నిసార్లు క్షమించాలి, అని ప్రభువును ప్రశ్నించాడు. అప్పుడు ప్రభువు ఆదికాండము 4:24 వచనములో పలికిన పలుకులను గుర్తు చేసుకొని, "ఏడు కాదు ఏడు డెబ్బది పర్యాయములు" అని సమాధానమిచ్చాడు.

ఇక్కడ సంఖ్య ప్రకారం క్షమించడం కాదు. అయితే సంఖ్యకు మిక్కుటంగా ప్రేమతో సహోదరుని క్షమించాలని అర్థం. ద్రోహం చేసిన సహోదరుని మనం క్షమించినపుడు మనం కూడా దేవుని నుండి క్షమను పొందగలం. అందుకే ప్రభువు ప్రార్థనలో "మా యొద్ద అప్పుబడిన వారిని మేము మన్నించునట్లు, మా అప్పులను మీరు మన్నించండి" అని ప్రార్థిస్తాం. మనం హృదయ

పూర్వకంగా క్షమింపని యెడల దేవుడు కూడా మన పాపాలను క్షమింపరని ఈ ఉపమాన ఉద్దేశం.

**ఉపమాన వివరణ**

ప్రభువు చెప్పిన ఉపమానాలలో ఈ ఉపమానం ఎంతో ప్రధానమైంది. ఈ ఉపమానంలో దయామయుడైన రాజును, ఇద్దరు సేవకులను మనము చూస్తూ వున్నాం. ఈ ఉపమానంలో సువార్తీకుడు రాజును, దయ, ప్రేమ, కరుణగల రాజుగా వర్ణించాడు. మొదటి సేవకుడు, అనగా కోట్ల వరహాల ఋణస్తుడు రాజుకు ఋణపడి వుండి దానిని తీర్చే స్తోమత లేక రాజుగారి కాళ్ళ మీద పడి, వేడుకొని ఋణం నుండి విముక్తిని పొందాడు. ఈ సేవకుడు రాజునుండి దయను, ప్రేమను, సంపూర్తిగా అనుభవించాడు. రెండవ సేవకుడు అనగా కొన్ని రూకల ఋణస్తుడు తోటి సేవకునికి ఋణపడి వున్నాడు. ఈ సేవకుడు కూడా మొదటి సేవకుని వలె తీర్చే స్తోమత లేక సేవకుని కాళ్ళపై పడి మొరపెట్టుకున్నాడు. అయితే దయ, కరుణ లేని ఆ సేవకుడు వానిని కఠినముగా శిక్షించాడు. ఈ ఉదంతాన్ని తెలుసుకున్న రాజు మొదటి సేవకున్ని దండించి, శిక్షించాడు. నేను నీపై జాలిచూపినట్లు, నీవు కూడా ఇతరులపై జాలిచూపవలదా? అని దండించాడు.

"ఏడు" అను సంఖ్య: పరిశుద్ధ గ్రంథం ప్రకారం ఏడు పరిపూర్ణ సంఖ్య. సామాజిక పరంగా కూడా ఏడు ఎంతో ప్రధానమైన సంఖ్య.

- ఇంద్రధనుస్సులో వున్న రంగులు ఏడు.
- వారాకి రోజులు ఏడు
- ప్రపంచములోని వింతలు ఏడు
- దేవుడు విశ్రాంతి పొందిన రోజు ఏడు
- సిలువలో యేసు పలికిన పలుకులు ఏడు
- మరియమాత అనుభవించిన వ్యాకులాలు ఏడు

వచనం 26: "కాళ్లపై పడుట"

కాళ్లపై పడడం అనునది తమను తాము పూర్తిగా సమర్పించుకోవడం

అని అర్థం. పూర్వం శిష్యులు గురువు కాళ్ళపై పడి నమస్కరించేవారు. అనగా గురువు దేవునితో సమానం అని భావించారు.

వచనం 30: “చెరసాలలో వేయించుట”

దొంగలకు, ద్రోహము చేసిన వారికి ఋణము చెల్లింపలేని వానిని ఆనాడు చెరసాలలో వుంచేవారు. అదే పద్ధతిని ఈనాడు కూడా కొనసాగిస్తున్నారు. చెరసాలలో వున్నవారు తమ ప్రవర్తనను మార్చుకొని తిరిగి దైనందిని జీవితాన్ని జీవించటానికి అదొక సదవకాశం.

**ఉపమాన అన్వయం**

మనం బలహీనులం. మనం సామర్థ్యలోపం గలవారం. మనకు మనంగా ఇతరులను పూర్తిగా క్షమించలేము. క్షమించే పరిస్థితిలో లేము. అంత శక్తి లేదు. ఆ శక్తిని మనం పొందాలి. క్షమాపణ శక్తిని మనం పొందాలి. అలా పొందాలంటే అది ఎక్కడ దొరుకుతుందో అక్కడికి వెళ్ళాలి. అది ఉద్భవించు చోటికి చేరుకోవాలి. అది దేవుని నుండి లభిస్తుంది. దైవ క్షమాపణ మనకు ఒక కృపానుగ్రహంగా అందించబడుతుంది. దేవుడు తన అనంత దయలో మనకు మన్నింపు దయచేస్తున్నాడు. తాను దయచేసిన క్షమను ఇతరులతో పంచుకోమని మనలను అడుగుతున్నాడు.

దేవుడే మనకు ముందుగా క్షమాపణ దయచేయని యెడల మనం ఇతరులను క్షమించే శక్తిని పొందలేము. ఆయన మన పాపములను లెక్కింపడు. ఆయన మన పాపముల చిట్టాను తన అమితమైన కారుణ్యముతో కప్పి వేస్తాడు. మరి అంత దయను దేవుని నుండి పొందిన మనం, అంతే దయను మన పొరుగు వారిపై చూపాలి. మనం ఇతరులను అర్థం చేసుకొని వారి తప్పులను మంచి మనసుతో మన్నించ గలిగినపుడు మనం దేవుడు ప్రసాదించు ‘క్షమాపణ ఆనందంలో’ పాలుపంచుకోగలం. కాబట్టి ఆ ఊట మొదలు దగ్గరకు వద్దాం. ఆ దేవుని కృపను సంపాదించుకుందాం. ఆ ఆత్మానందంతో సాగిపోదాం. మన సోదరుని చేరుకుందాం. ఆ ఆనందం ఊటలో పొరుగువారి తప్పులను బాపివేద్దాం.

## ఉపమాన ముగింపు

ఈ ఉపమానం ద్వారా పరలోక రాజ్యంలో గొప్పవాడు "తన పట్ల ద్రోహము చేసిన వారిని క్షమించువాడు" అని ప్రభువు పలుకుచున్నాడు. ఇది మనస్సులనూ, మనస్తత్వాలనూ మార్చే ఉపమానం. క్రీస్తు ప్రభువు చాలా సార్లు క్షమాపణ గూర్చి ప్రస్తావించారు. వాటిలో ఈ ఉపమానం కూడా ఒక్కటి. యూదులు మతాచారాలను, సాంప్రదాయాలను పాటించడంలో వారికి వారే సాటి. యూదా సమాజంలో ఎవ్వరైన గొఱ్ఱెను కాని, ఆవును కాని దొంగిలిస్తే అతని దొంగిలింపబడిన యూదుడు మొత్తం ఆస్తినంతటిని దొంగలించెడివాడు. అలాంటి సందర్భాలలో మోషే ప్రవక్త "కంటికి కన్ను, పంటికి పన్ను" అనే కట్టడలను చేశాడు. నాడు క్రీస్తు ప్రభువు ద్రోహం చేసిన వారిని క్షమించమని చెప్పడమే కాదు, ఆయన జీవితం ద్వారా చూపించారు. క్రీస్తు ప్రభువు కరుణామయుడు, దయామయుడు కావున శత్రువులను సైతం క్షమించారు. ఇలాంటి క్షమాపణనే ప్రభువు ప్రతి క్రైస్తవుని నుండి కోరుతున్నారు. కావున, ప్రభువును చేరుదాం. ప్రార్థనతో ఆయన క్షమాపణ పొందుదాం. ఆ ఆనందమును ఇతరులతో పంచుకుందాం. దేవుడు మనలను దీవించును గాక! ఆమెన్.

❋ ❋ ❋ ❋

# 4. వివాహవిందు - పరలోక రాజ్యం

**- బ్రదర్ మొలక విజయ్**

## పరిచయం



యేసు బోధించడం ప్రారంభించినపుడు, కేవలం మూడు చిన్న వాక్యాలను చెప్పారు, అవి అతని పరిచర్య యెక్క కేంద్ర బిందువు. మార్కు సువార్త ఒకటన అధ్యాయము 15వ వచనంలో యేసు ఇలా చెబుతున్నారు. ‘‘కాలము సంపూర్ణమైనది. దేవుని రాజ్యము సమీపించినది. హృదయ పరివర్తనము చెంది సువార్తను విశ్వసింపుడు.” యేసు పలికిన మాట “కాలము సంపూర్ణమైనది” అంటే ఏమిటి? ఇది పాతనిబంధనలో దేవుడు యిస్రాయేలు ప్రజలకు చేసిన వాగ్ధానాల నెరవేర్చు సమయం. మరి ఈ హామీలు ఎలా నెరవేరుతాయి? రెండవ వాక్యం ద్వారా సమాధానం ఇవ్వబడింది. “దేవుని రాజ్యం సమీపించినది”, దేవుని కుమారుడైన యేసు రాకతో దేవుని రాజ్యం వచ్చింది మరియు వాగ్ధానాలు నెరవేరాయి. యేసును చూస్తున్న, ఆయన మాటలు వింటున్న ప్రజల వైఖరి ఎలా ఉండాలి? ఈ వైఖరి మూడవ వాక్యంలో పేర్కొనబడింది. “హృదయ పరివర్తనము చెంది సువార్తను విశ్వసింపుడు” మరియు ఈ బోధనను వివరించడానికి యేసు “పెండ్లి పిలుపు/వివాహవిందు” గురించి ఒక ఉపమానాన్ని వివరించాడు (మత్తయి 22:1-14). ఈ ఉపమానం దృష్టి కుమారుని వివాహ విందుపై ఉంది. పరలోక రాజ్యాన్ని వివాహ విందుతో పోల్చారు.

## సందర్భం

యేసు సిలువ వేయబడటానికి ముందు జెరూసలేంలో చివరి వారంలో, మతపరమైన అధికారులతో జరిగిన ఘర్షణలో ఈ ఉపమానాన్ని చెప్పారు.

దేవుని రాజ్యం మరియు అది దైవిక తీర్పుపై అతని బోధనలతో ముగిసింది. మత్తయి సువార్తలో ఎనిమిదవసారి యేసు “పరలోక రాజ్యం వంటిది” అనే పదాలతో ఉపమానాన్ని ప్రారంభించాడు (మత్తయి 13:24, 31, 33, 44, 45, 47 మరియు 52).

ఈ ఉపమానం యొక్క సందర్భాన్ని బాగా అర్థం చేసుకోవడానికి, యేసు కాలంలోని వివాహాల గురించి కొన్ని ప్రాథమిక వాస్తవాలను తెలుసుకోవడం చాలా ముఖ్యం. యూదా సమాజంలో, నిశ్చితార్థం చేసుకున్న వారి తల్లిదండ్రులు సాధారణంగా వివాహ ఒప్పందాన్ని రూపొందింస్తారు. ఈ ఒప్పందంపై సంతకం చేసినపుడు వధూవరులు కలుసుకుంటారు, బహుశ మొదటి సారి. ఈ సమయంలో ఈ జంట వివాహం చేసుకున్నారని భావిస్తారు, అయితే వారు వేడుక జరిగే అసలు సమయం వరకు విడిపోతారు. వధువు తన తల్లిదండ్రులతో ఉంటుంది, మరియు వరుడు వారి ఇంటిని శుభ్రం చేయడానికి బయలు దేరతాడు. దీనికి కొంత సమయం పట్టవచ్చు. ఇల్లు అంత సిద్ధమైనపుడు వరుడు తన వధువు కోసం నోటీసులేకుండా తిరిగి వస్తాడు. ఆ తర్వాత వివాహ వేడుకలు, వివాహ విందులు జరుగుతాయి. వివాహ విందు అనేది యూదులు జీవితంలో అత్యంత సంతోషకరమైన సందర్భాలలో ఒకటి మరియు ఇది ఒక వారం వరకు ఉంటుంది.

## ఉపమానం వివరణ

ఈ ఉపమానంలో, యేసు పరలోక రాజ్యాన్ని, ఒక రాజు తన కొడుకుకోసం సిద్ధం చేసిన వివాహ విందుతో పోల్చబడింది. వివాహ విందుకు ఆహ్వానం అనేది దేవుడు అయిన గొప్ప రాజుతో ఒడంబడిక/సంబంధం ఉండాలి. ఈ సంబంధం ప్రతీతాత్మకంగా వివాహంగా సూచించబడుతుంది. ఈ ఉపమానంలో మూడు రకాల ఆహ్వానాలను మనం గమనించాలి. కొంత మంది అతిధులు ఆహ్వానాన్ని తిరస్కరించారు. మానవులతో దేవుని సంబంధాన్ని ప్రారంభించనప్పటి నుండి అతను తనతో ఒడంబడిక సంబంధాన్ని కలిగి ఉండటానికి మానవాళిని, (వివాహ అతిథులు) ఆహ్వానించాడు. కొందరు దేవునితో సంబంధాన్ని ఏర్పరచుకోవటానికి మరియు “విందుకు రావడానికి”

సమయాన్ని వెచ్చించకుండా తాత్కాలిక ఆందోళనలతో చాలా నిమగ్నమై ఉన్నారు. మరి కొందరు శత్రుత్వం కలిగి ఉంటు మరియు మోక్షంలో ప్రవేశించే ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఈ ఉపమానంలోని వ్యక్తులు యేసుకాలంలోని మోక్షానికి సంబంధించిన సువార్త సందేశం ద్వారా రాజ్యానికి ఆయన పంపిన ఆహ్వానానికి మిశ్రమ స్పందన కలిగి ఉన్న వ్యక్తుల వైఖరిని ప్రతిబింబిస్తుంది.

3. ఆహ్వానింపబడిన వారిని విందుకు బయలు దేరి రండు అని చెప్పుటకు తన సేవకులను పంపెను. కాని వారు వచ్చుటకు నిరాకరించిరి.

4. అందుచే అతడు, 'ఇదిగో! నా విందు సిద్ధపరపబడినది. ఎద్దులను, క్రొవ్విన దూడలను, వధింపబడినవి. అంతయు సిద్ధముగా ఉన్నది. కనుక విందుకు రండు! అని మరియెక మారు వారితో చెప్పుదని మరికొందరు సేవకులను పంపెను.

3వ వచనములోని మొదటి సేవకుల సమూహం దేవుని పాతనిబంధన ప్రవక్తలను సూచిస్తుంది. వారు ప్రజల పశ్చాత్తాపం మరియు మోక్షానికి పిలుపునిచ్చారు.

4వ వచనములోని రెండవ సేవకులు యేసు శిష్యులు మరియు అపోస్తులులను సూచిస్తుంది, వారు యేసు యొక్క రక్షణ మరియు అతని రాజ్యం యొక్క శుభవార్త (సువార్త) బోధిస్తుంది.

5. కాని పిలువబడినవారు దానిని లక్ష్యపెట్టక, తమతమ పనులకు పోయిరి ఒకడు తన పొలమునకు, మరియొకడు తన వ్యాపారమునకు వెళ్ళెను.

6. తక్కిన వారు అతని సేవకులను పట్టుకొని వారిని కొట్టిచంపిరి. మానవ చరిత్రలో, ప్రజలు మోక్షానికి, దేవుని పిలుపును విస్మరించడానికి సాకులు కనుగొన్నారు. జీవితం యొక్క ఆందోళనలు లేదా ప్రలోభాలు వారిని ప్రభువుతో సహవాసం నుండి దూరం చేస్తాయి. దేవునితో ఒడంబడిక సంబంధానికి వచ్చిన ఇతరులు అతని సేవకులను, ప్రవక్తలను దుర్వినియోగం చేసి చంపారు.

7. అపుడు ఆ ప్రభువు మండిపడి తన సైన్యమును పంపి ఆ హంతకులను హతమార్చి వారి పట్టణములనుర తగుల బెట్టించెను.

పవిత్ర గ్రంథములోని చారిత్రత్మక సంఘటనలను చూసినట్లైతే, అతని ప్రవక్తలను హత్యచేసిన మరియు అతని ఆజ్ఞలను ఉల్లంగించిన వారిపై ఉపమానంలో దేవుని దైవిక తీర్పుతో సరిపోతాయి. సినాయి ఒడంబడిక ప్రజలు వారి ఒడంబడిక బాధ్యతలను తిరస్కరించినపుడు, తప్పుడు దేవుళ్ళను ఆరాధించారు, మరియు ప్రజలకు వ్యతిరేఖంగా నేరాలు చేసినపుడు దేవుడు తన రక్షణ చేతిని ఉపసంహరించుకున్నాడు. ఇశ్రాయేలు కరువు, అనారోగ్యం, యుద్ధం మరియు ప్రవాసం యొక్క వినాశనాలను ఎదుర్కొంది. దేవుడు ప్రవాసం నుండి భూమికి తిరగి రావడానికి నమ్మకమైన ప్రజల శేషాన్ని విడిచిపెట్టాడు మరియు దేవుని ఒడంబడికకు విధేయతను పునరుద్దరించాడు. అయితే యేసు కాలంలోని ఒడంబడిక ప్రజలు మరియు వారి మత నాయకులు పాత నిబంధన తీర్పుయొక్క పాఠాలను మరచిపోయారు. వారు వాగ్ధానం చేయబడిన మెస్సయ అయిన వారి 'పెండ్లికుమారుని' తిరస్కరించడం ద్వారా మానవాళి యొక్క మోక్షానికి దేవుని దివ్య ప్రణాళికను తిరస్కరించారు. కాబట్టి యేసు తన ఉపమానంలో రాబోయే దైవిక తీర్పు గురించి హెచ్చరికను ఇస్తున్నాడు.

యేసును తీవ్రంగా వ్యతిరేకించిన మత పెద్దలకు ఏమిటంటే, జెరూసలేము మరియు దేవాలయాన్ని నాశనం చేయడం అనేది ప్రజల ప్రవాసంలో చరిత్ర పునరావృతమవుతుంది. రోమన్లు 70AD లో విపత్తు హెచ్చరికను నెరవేర్చారు. ఇది 587/6BC లో బాబి లోనియన్లచే జెరూసలేం మరయు సొలోమోను ఆలయాన్ని నాశనం చేయడం యొక్క పునరావృత్తం. యేసు ఉపమానం దేవుని దైవిక రక్షణ ఉపసంహరణకు సమాధానం ఇస్తుంది. యేసు యొక్క రక్షణ సువార్త ద్వారా దేవుని రాజ్యంలోకి ప్రవేశించాలనే ఆహ్వానాన్ని తిరస్కరించడం.

8. అంతట తన సేవకులను పిలిచి, 'నా విందు సిద్ధముగా ఉన్నది. కాని, నేను ఆహ్వానించిన వారు దానికి యోగ్యులు కారు.

9. ఇపుడు మీరు వీధి మార్గములకు పోయి, కనపడిన వారినందరిని పిలుచుకునిరండు' అని పంపెను.

10. ఆ సేవకులు పుర వీధులలోనికి వెళ్ళి, మంచి చెడు తేడా లేకుండా తమకంటబడిన వారినందరిని తీసుకొనివచ్చిరి. ఆ కళ్యాణ మండపము అతిథులతో నిండెను.

రాజు రెండు మార్లు ఆహానాన్ని పంపించాడు. కాని రాజుగారి ఆహ్వానాన్ని తిరస్కరించారు. అపుడు రాజు ఆహ్వానించబడిన వారు. ఇకపై అర్హులు కాదు అని చివరి సారిగా ఆహ్వానాన్ని పంపిస్తున్నాడు. ఇప్పుడు వివాహవిందుకు ఆహ్వానం అందుకున్న బయటి వ్యక్తులు ఎవరు? దైవిక పెండ్లికుమారుడు, యేసు మెస్సయ ఉన్నాడు. మరియు ఇది 'వివాహవిందు' ప్రారంభమయ్యే సమయం. కాబట్టి రాజైన తండ్రి దేవుడు, ప్రజలందరికీ తన ఆహ్వానాన్ని తెలియజేస్తున్నాడు/అందజేస్తున్నాడు. ఆహ్వానం ఇకపై సినాయి ఒడంబడిక ప్రజలకు మాత్రమే పరిమితం కాదు, ప్రవక్త యెషయ (25:6, 66:18) ద్వారా ప్రకటించిన అన్ని దేశాల ప్రజలందరికీ. ఇశ్రాయేలీయులు/యూదులు మరియు అన్యులు అందరూ పెండ్లికుమారుడు, యేసుక్రీస్తుతో అతని క్రొత్త ఒడంబడిక చర్చి (దేవాలయము), వధువు సభ్యులుగా ఒడంబడికలో ఉండమని ఆహ్వానించబడ్డారు.

11. అతిథులను చూచుటకు రాజులోనికి వెళ్ళి, వివాహ వస్త్రము లేని వానిని ఒకనిని చూచి.

12. మిత్రమా! వివాహ వస్త్రము లేక నీవు ఇచటికి ఎట్ల వచ్చితివి అని అతనిని ప్రశ్నించెను. అందుకు అతడు మౌనము వహించి ఉండెను.

13. అపుడు ఆ రాజు తన సేవకులతో, 'ఇతనిని కాలుసేతులుకట్టి వెలుపల ఉన్న చీకటిలోనికి త్రోసివేయుడు. అచట జనుల విలపించుచు పండ్లు కొరుకొందురు' అనెను.

వివాహ విందులో చేరిన అతిథులు క్రైస్తవ జ్ఞానస్నానము అనే బాప్టిజం (బప్తిస్మము) యొక్క మత ఆచారంలో నీరు మరియు ఆత్మ ద్వారా బాప్తిస్మము పొందినవారు. క్రొత్త ఒడంబడిక చర్చి యొక్క సభ్యులు, క్రీస్తు శరీరం, పెండ్లికుమారుడితో చేరారు మరియు పరిశుద్ధతో కలిగిన మంచి పనులు అయిన కృప యొక్క వస్త్రాన్ని అతని వధువుగా ధరించాలి (దర్శన గ్రంథము 19:7-8, 1 కొరింతీ 6:15-17; 2 కొరింతీ 11:2, యోహాను 2:13-14,24-26 మరియు CCC. 546).

9వ వచనం చూచినట్లతే మనకు ఒక సందేహం కలగవచ్చు. ఏమిటంటే రాజు తన సేవకలును పిలిచి వీధులలో ఉన్న ప్రతి క్కొరిని, కనపడినవారందరిని విందుకు పిలుచుకొని రమ్మని ఆజ్ఞాపించాడు. కాని 11,12,13 వచనాలలో వివాహ వస్త్రంలేని ఒక వ్యక్తిని చూచి అతనిని చీకటి గదిలో పడవేయుడని తన సేవకులతో ఆజ్ఞాపిస్తున్నాడు. ఇక్కడ యూదులు సాంప్రదాయం ప్రకారం ఎవరైతే వివాహవస్త్రం లేని వారు విందు యొక్క యజమాని దగ్గరికి వెళ్ళి వివాహ వస్త్రం తీసుకొనవచ్చును. కాని ఈ వ్యక్తికి ఆ వివాహ వస్త్రాన్ని తీసుకొని ధరించే సమయం కూడా లేదు. ఎవరు ఏమంటారులే అనే గర్వంతో ఆ చిన్నపాటి సమయాన్ని కూడా వెచ్చించకుండా వెళ్ళి లోపల కూర్చున్నాడు. అతిధులను చూచుటకు రాజు లోపలికి వచ్చి చూడగా ఒకడ వివాహ వస్త్రం లేకుండా కూర్చొని ఉన్నాడు. రాజు తన సేవకులను పిలిచి, వివాహ వస్త్రం లేనటువంటి వ్యక్తిని చూచి, అతనిని బంధించి, చీకటిలో పడవేయుడు అని ఆజ్ఞ ఇచ్చాడు ఎందుకంటే అతడు కృపతో కూడిన వివాహ వస్త్రాన్ని ధరించిరాలేదు. అతడు విందుకు హాజరు కావాలనుకొన్నాడు, కానీ అతడు నిజమైన పశ్చాత్తాపం మరియు అతని విశ్వాసాన్ని ప్రదర్శించే నీతి క్రియల ద్వారా శుద్ధి చేయబడిన ఆత్మను సమరిం్పచడానికి సమయాన్ని వెచ్చించకుండా వెళ్ళి పెండ్లికుమారుని విందులో కూర్చున్నాడు (యోహాను 2:24). రాజైన తండ్రి/దేవుడు సంసిద్ధత లేని అతిధిని సమాచారం ఇవ్వమని మరియు అతని పాపములను ఒప్పుకోమని పిలిచాడు. కాని అతడు మౌనంగా ఉన్నాడు, అతడు క్షమాపణ అడగడానికి తప్పుడు ఆలోచనలతో, గర్వంతో విఫలమయ్యాడు. హెచ్చరిక ఏమిటంటే, తీర్పు సమయంలో, వారి ప్రత్యేక తీర్పులో దేవుని ముందు సయోధ్య అన్నది మత ఆచారం. వారి ఆత్మలను శుభ్రపరచడంలో విఫలమైనవారికి చాలా సమయం పడుతుంది. క్రీస్తు వధువు అని చెప్పుకునే వారు కృప అనే "వస్త్రం"తో కప్పబడి ఉండాలి, దాని ఆకృతి మంచి పనులు (దర్శన గ్రంధము 19:7-8). పదాలు సరిపోవు, నీతి మరియు న్యాయం యొక్క చర్యలలో నిజమైన విశ్వాసం ప్రదర్శించబడితే, అది మోక్షానికి మార్గం అవుతుంది (యోహాను 2:24). విశ్వాసం మరియు మంచి పనులు లేకుండా తమ స్వంత నిబంధనలు మరియు అయోగ్యతలతో శాశ్వతమైన మోక్షానికి

రావాలని భావించేవారు తిరస్కరింపబడుతారు మరియు బయట చీకిలో వేయబడతారు. అక్కడ ఏడుపు మరియు పళ్ళుకొరుక్కుంటారు. 13వ వచనంలో అచట జనులు విలపించుచు పండ్లు కొరుకు కొందురు. ఈ స్థలం ఇతర ఉపమానములో వలే శాశ్వతమైన తీర్పు యొక్క స్థలం, ఉదాహరణకు మత్తయి 13:49,50లో - అట్లే అంత్యకాలమందు జరుగును, దూతలు బయలుదేరి దుష్టులను నీతిమంతుల నుండి వేరు పరచి, అగ్ని గుండములో పడవేయుదురు. అచటవారు ఏడ్చుచు, పండ్లు కొరకు కుందురు.

14. పిలువబడినవారు అనేకులు, కాని ఎన్నుకొనబడినవారు కొందరే.

అతిధులు అంటే ఆహ్వానించబడినవారు. ఈ ఉపమానంలో ఆశ్చర్యం ఏమిటి అంటే పిలువబడినవారు ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఆస్థానంలో ఇతరులను పెండ్లి విందుకు ఆహ్వానించడం మనం గమనిస్తుంటాం. పిలువబడినవారు, ఎన్నుకొనబడినవారు వీటి మధ్య వ్యత్యాసం ఏమిటి?

పిలువబడినవారు కేవలం క్రైస్తవ జీవితం జీవించడమే సరిపోదు, మరో క్రీస్తులో జీవించడానికి ఎన్నుకోబడాలి. కేవలం సువార్త వినుటకు పిలువబడితే సరిపోదు, మన జీవితం సువార్త ప్రకారం జీవించేలా ఎన్నుకోబడాలి. కేవలం మనం గుడికి వెళ్ళడానికి పిలువబడితే సరిపోదు, మన హృదయమే దేవుని దేవాలయంలా తయారు చేసుకోవడానికి ఎన్నుకోబడాలి. ఎన్నుకొనబడిన ఈ జీవితంలో మనం ఇరుకైన మార్గంలో ప్రయానిస్తు, మత్తయి 16:24లో చెప్పినట్లుగా 'నన్ను అనుసరింపగోరువాడు తన్నుతాను పరిత్యజించుకుని, తన సిలువను ఎత్తుకుని నన్ను అనుసరింపవలెను.' అపుడే మనము పిలువబడినవారము గాక ఎన్నుకోబడినవారము అవుతాము.

**ముగింపు**

మానవులందరు రక్షింపబడాలని దేవుని కోరిక (1 తిమోతి 2:3-4, 2 పేతురు 3:9). దేవుడు శాశ్వతమైన మోక్షానికి సంబంధించిన విందు యొక్క పవిత్ర భోజనానికి రావాలని మనల్ని ఆహ్వానిస్తున్నారు. శాశ్వతమైన దీవెనలలో ఏమి ఎదురుచూస్తుందో దానియొక్క ముందస్తు రుచిగా, ఇది మొదట

దివ్యసత్ప్రసాద విందులో మనకు విస్తరించబడుతుంది. తండ్రియైన దేవుడు తనకుమారుని ఏసుక్రీస్తును మన పెండ్లి కుమారుడిగా పంపాడు, మరియు వరుడైన క్రీస్తుతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకోవడానికి జ్ఞానస్నానం అనే కృపతో కూడిన వివాహ వస్త్రాన్ని ధరించడానికి స్వయముగా క్రీస్తే మనకు దివ్యసంస్కారాలను అందించాడు (స్థాపించాడు).

రాజు యొక్క (దివ్యబలిపూజ) విందుల పాల్గొనమని దేవుడు మనలందరిని ఆహ్వానిస్తున్నారు. వివాహ వస్త్రమును ధరించమంటున్నాడు. సిద్ధపడమంటున్నాడు. పాపాల కొరకై ప్రాయశ్చిత్తపడమంటున్నాడు. నీ పాపపు వస్త్రాన్ని తీసివేసి, మురికి, చిరిగిపోయినట వంటి వస్త్రాన్ని తీసివేసి, పరిశుద్ధత, పవిత్రత వస్త్రాన్ని కట్టుకొని ప్రభు విందులో పాల్గొనమని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాడు. దేవుడు మనలను ఆశీర్వదించి ఉచితంగా తన విందులో పాల్గొనమంటున్నాడు. తన సన్నిధికి రమ్మంటున్నాడు. ఈ ఉపమానంలో మాదిరిగా మనము కూడా ఈ విందులో పాల్గొనకుండా అనేక సాకులు చెప్పుకుంటూ, ఈలోక ఆశలకు ప్రాధాన్యత ఇస్తున్నామా? దేవుడు ప్రతి ఒక్కరిని ఆహ్వానిస్తాడు. కాని అతడు మనల్ని కూడా సమూలంగా ఎన్నుకోమని అడుగుతాడు. శాశ్వతమైన రాజ్యం కోసం మనం అన్నింటినీ వదులకోవడానికి సిద్ధంగా ఉండాలి (మత్తయి 16:24-28, మార్కు 8:34-38, లూకా 9:23-27). ఇక రాబోయే నిర్ణయం మనదే. అపుడు రాజు సిద్ధంగా ఉండాలి (మత్తయి 16:24-28, మార్కు 8:34-38, లూకా 9:23-27). ఇక నిర్ణయం మనదే. దేవుని చేత ఎన్నుకొనబడిన వారులా ఉండాలా? లేక దేవుని చేత పిలవబడిన వారిమాదిరిగా ఉండాలా? దేవుని చేత ఎన్నుకొనబడాలి అంటే మనపాపపు జీవితాన్ని తీసికొని, ప్రభువు ఒసగే ఆ రక్షణ వస్త్రాన్ని ధరించి, దేవునికి ప్రియమైన బిడ్డలుగా జీవిస్తు ఆయన విందులో పాల్గొనాలి. ఇది మన రక్షకుడైన దేవునికి సంతోషకరమైనది మరియు మనమందరం రక్షింపబడాలని మరియు సత్యాన్ని తెలుసుకోవాలని కోరుకుంటున్నాడు.

| | |
|---|---|
| **వివాహావిందు** | : పరలోక రాజ్యం |
| **రాజు** | : తండ్రి దేవుడు |
| **పెండ్లి కుమారుడు** | : యేసుక్రీస్తు |
| **మొదటి ఆహ్వానము** | : యిస్రాయేలు ప్రజలు |
| **మొదటి సేవకులు** | : పాతనిబంధన ప్రవక్తలు |
| **రెండవ ఆహ్వానము** | : యూదులు మరియు క్రైస్తవులు |
| **రెండవ సేవకులు** | : యేసు శిష్యులు మరియు అపోస్తులు |
| **మూడవ ఆహ్వానము** | : ప్రతి ఒక్కరికి |
| **వివాహ వస్త్రము** | : జ్ఞానస్నానము, పవిత్రత, పరిశుద్ధత, సిద్ధపాటు |

❋ ❋ ❋ ❋

# 5. గోధుమలు - కలుపుగింజలు

- బ్రదర్ బడిపాటి జాకబ్

## ఉపమాన పరిచయం



ఈ ఉపమానం ప్రస్తుత సమాజన్ని పోలి ఉంది. ఈ యొక్క ఉపమానంలో యేసు ప్రభు పరలోక రాజ్యాన్ని, గోధుమలు మరియు కలుపు మొక్కలు కలసి పెరిగే పొలముతో పోల్చుతున్నాడు. పొలము యొక్క యజమాని వాటిని కోతవరకు, గోధుమల నుండి కలుపు మొక్కలు వేరు చేయబడే వరకు వాటిని పెంచాలని నిర్ణయించుకుంటాడు, ఇది ప్రపంచములో మంచి మరియు చెడు ఎలా, సహజీవనం చేయగలదో చెప్పే శక్తివంతమైన రూపకం. కానీ చివరికి తీర్పు మరియు విభజన సమయం ఉంటుందని యేసు ప్రభువు క్లుప్తంగా వివరించియున్నారు.

## ఉపమాన చారిత్రకత

యూదమత్ర సాహిత్యంలో యేసు ప్రభువు శుత్రువులను పూర్తిగా జయించి విజయం సాధిస్తాడని నమ్మరు ఆ విజయం తదనాతరం యిస్రాయేలీలకు ఒక గొప్ప శాంతి, సంతోషలు కలుగుతాయని వారు ధృడంగా బావించారు, నమ్మియున్నారు. యుదులు దేవుని రాజ్యం అద్భుతరీతిలో ఉంటుందని నిరీక్షించారు, ఎదురుచూశారు. కాని యేసు క్రీస్తు, దేవుని రాజ్యం రహస్య మైనదిగాను, అదృశ్యమైనదిగాను ఉండబోతుందని స్పష్టంగా బోధించాడు. మన ఊహలకు అతీతంగా కాకుండా వాస్తవ పరిస్థితులను తేలుసుకొని జీవించాలి అని క్రీస్తు ప్రభువు యూదులకు ఈ ఉమానం ద్వారా తెలియచేశారు. పాతనిబంధనలో యూదులను 'సేద్యం' సాగుబడిలో పోల్చడన్ని మనం యెషయ

61:3లో గమనించవచ్చు. కుమ్రాను యూదుల మత గ్రంథం సాహిత్యంలో గూడా యిస్రాయేలియులను నిరంతరం సేద్యంతో పోల్చారు. కాబట్టి మంచి మొక్కలు, మరియు కలుపు మొక్కలు తేడా వారికి బాగా తెలుసు. దీనిని దేవుని సహనం మరియు అంతిమ తీర్పు గురించి మనకు బోధించే శక్తివంతమైన సారూప్యతగా గుర్తించవచ్చు.

**ఉపమాన వివరణ**

ఈ యొక్క ఉపమానం దేవుని న్యాయాన్ని, సహనాన్ని, ఉదార స్వభావాన్ని తెలియజేస్తుంది. గోధుమలు, చేమలవలె మన సమాజంలో సత్పురుషలు, దుష్టులు కలసి ఉన్నారు. చెడ్డవారిని మంచి వారి నుండి వేరు చేయటం చాలా కష్టతరం. కొందరు చెడ్డవారు మంచివారిగా కనిపించవచ్చు. కొందరు మంచివారు చెడ్డవారిగా కనిపించవచ్చు. ఇక్కడ మనం ఇద్దరు వ్యక్తులను గమనించుదాం :

అబ్రహాం లింకన్ మరియు ఎడ్విన్ స్టాంటన్

అబ్రహాం లింకన్ అమెరికా అగ్రరాజ్యాన్ని పరిపాలించి నటువంటి నాయకులలో ప్రధముడు. అతనిలో చాలా గొప్ప సుగుణాలు ఉన్నాయి. ఈ సుగుణాలన్నిటికంటే కుడా గొప్పది తనలో ఉన్నటు వంటి సహనం, ఓర్పు. తాను అమెరికా అధ్యక్షుడు కావడానికి తాను ఎన్నికలలో నిలబడినపుడు తన ప్రత్యర్థి అయినటువంటీ ఎడ్వీన్, లింకన్‌ను చాలా దారుణంగా అవమానించాడు, అవహేళన చేసాడు, ఎగతాళి చేసాడు, లింకన్ తెలివికలవడేకాని, తన యెక్క రూపం, ఆకారం అంత అందముగా ఉండదు. అప్పుడు లింకన్ ని ఎడ్వినో ఈ విధంగా అంటూ, అబ్రహాం లింకన్ ఒక చింపాంజీగా, కోతిగా పోలుస్తాడు. అవహేళన చేస్తాడు. ఎన్నో విధములైన మాటలతో గుచ్చుతూ హేళన చేస్తాడు. కాని లింకన్ ఏనాడు కుడా ఎడ్విన్‌కి ఒక్క మాట ఎదురు పలకకుండా రాజ్యంగ బద్ధంగా వ్యవహరించాడు, చివరికి లింకన్ అమెరికాకు అధ్యక్షుడువుతాడు. కాని లింకన్ ఇదే అవకాశం అనుకోలేదు. ఆ ఎడ్విన్ని తీసుకునివచ్చి తన యొక్క పరిపాలనలో సాయుధమంత్రి పదవిని ఇచ్చాడు. ఎందుకంటే ఎడ్వినికి చాలా ప్రతిభ ఉంది. దానిని వినియోగించటానికి, ఆ సాయుధమంత్రి పదవిని

ఇచ్చాడు. ఆ తరువాత లింకన్ హత్యచేయబడిన తరువాత, ఎడ్విన్ మొట్టమొదటిసారిగా నిలబడి కన్నీళ్ళతోటి లింకన్ని మించిన నాయకుడు లేడు, ఈ ప్రపంచంలో ఇంకా పుట్టలేదు అని చెబుతాడు. తాను ఎవరినైతే చింపాంజీ, కోతి అని అవహేళన చేసాడో, ఆయన గురించే చాలా గొప్పగా చెప్పాడు.

అదే విధంగా దేవునికి మానవుని మీద ఓర్పు సహనం చాలా కనబరుస్తున్నాడు. పాపుల మీద ప్రేమను కురిపిస్తున్నాడు. మానవులుగా మనం ఒకరి మీద ఒకరు నిందలు వేసుకుంటూ, వాడు నాకు అన్యాయం చేస్తున్నాడు వాడు పాపం చేస్తున్నాడు. ఎన్నో అగౌరమైన పనులు చేస్తున్నాడు మరి దేవుడు ఎందుకు వీరిని శిక్షించడంలేదు అని అన్నప్పుడు, ఒక గొప్ప వ్యక్తి ఇలా అంటాడు. “అన్యాయం చేసినా, తప్పు చేసినా పాపం కట్టుకున్నా, ప్రతి వ్యక్తిని దేవుడు శిక్షించాలి అంటే మనలో ఏ ఒక్కరం బ్రతికి ఉండరు” అంటాడు.

ఎందుకంటే మనం ఏన్నో పాపములు, మోసాలు, దొంగతనాలు, ఇలా ఒక్కటి కాదు ఏన్నో చేస్తాం. కాని మనం ఇంకా బ్రతికి ఉన్నాము అంటే దానికి ఒక్కటే కారణం. తండ్రి భగవానుడు సహనశీలీ, ఓర్పుగలవాడు. దేవుడు సరియైన న్యాయాధిపతి, ఆయన తీర్పులో ఏ లోటు ఉండదు. ఈ జీవితం తర్వాత మరో జీవితముంది. అది శాశ్వత జీవితం. ఈ జీవితాంతాన దేవుని శిక్షకు గురియయ్యేవారు రాబోవు జీవితంలో శాశ్వతంగా బాధలనుభవిస్తారు. దేవుని బహుమానాన్ని పొందేవారు కలకాలం సుఖంగా పరిశుద్ధ జీవితం జీవిస్తారు. మనం దేవుని మౌనాన్ని లోతుగా అర్థం చేసుకొలేము.

ఆయన మనకు ప్రతిసారి మరో అవకాశం ఎందుకు ఇస్తున్నారు! మనం అర్థం చేసుకోవాలి; పాపాత్ముని మరణాన్ని కాదు, మారు మనసును కోరుకునే దేవుడు ఆ హృదయ పరివర్తన కోసం చాలా ఓర్పుతో వేచి ఉంటాడు. మానవ కొలతలకు ఆయన అందడు, ఆయన కరుణను మనం కొలువలేము. ఆయనే సాతానును అనుమతించినప్పుడు ఇక ఆయన సంకల్పాన్ని సంశయించుటకు మనం ఏపాటి వారము! కోతకాలము వరకు ఆయనే సహనంతో ఆగినప్పుడు మనం సాతానుతో పోరాటం చేస్తూ సాగలేమా అని ఒక్కసారి ఆలోచన చేయాలి.

ఉపమానంలో చెప్పినట్లుగా గోధుమలకు కలుపు గింజలకు తేడా

కనుక్కోవడం చాలా కష్టం. అలాగే ఈ లోకంలో వారు మంచివారు వీరు చెడ్డవారు అని విభజించడం చాలా కష్టం. ఎందుకంటే ఒక వ్యక్తి తన అనుభవాన్ని బట్టి ఇతరుల అనుభవాన్ని బట్టి మాత్రమే వేరేవారిని మంచి వారిగా లేదా చెడ్డవారిగా నిర్ణయిస్తారు. అయితే మన నిర్ణయాలన్నీ ఖచ్చితమని చెప్పలేం. దీనినే క్రీస్తు ప్రభు లూకా 6:43-44 లో "వృక్షము ఫలము" అనే అంశంలో చెప్పారు. ఈ ఉపమానం ద్వారా జీవితంలో అసలైన పరిక్ష ఇప్పుడే కాదు అని అది చివరన న్యాయతీర్పు అని హెచ్చరిక చేస్తుంది. సమాజంలో మంచివారు చెడ్డవారు కలిసే ఉంటారు. కాని యేసు ప్రస్తుత ఉపమానం ద్వారా ఇతరులను ఖండించడం లేక ఇతరుల మీద న్యాయ నిర్ణయం చేయడానికి తొందర పడవద్దు అని తెలియచేస్తున్నారు. అలాగే మత్తయి 7:1 ద్వారా పరుల గూర్చి మీరు తీర్పు చేయకుడు. అప్పుడు మిమ్ములను గూర్చి అట్లే తీర్పు చేయబడదు అని తెలియచేస్తున్నారు.

## పరివర్తనకు పిలుపు

ఉపమానంలో యజమానుడు కడవరకు గోధుమలను: కలుపు గింజలను పెరగనిచ్చాడు. ఇదే విషయాన్ని మనం యోహాను 13/21వ వచనములో గమనించవచ్చు. యేసు అంతరంగమున బాధపడుచు మీలో ఒక్కడు నన్ను అప్పగింప నున్నాడని నిశ్చయముగా చెప్పుచున్నాను అని స్పష్టముగా పలికెను. ఈ వాక్యాన్ని మనం పరిశీలించినట్లయితే యేసు ముందుగానే తనను అప్పగింపబోవు శిష్యుని అంతరంగం తెలిసికూడా తన ప్రేమను సంపూర్ణంగా వ్యక్త పరిచాడు. ఇతర శిష్యులను ఎలా ప్రేమించాడో యూదా ఇస్కారియోతును కూడ అదే విధంగా ప్రేమించాడు. ఇంకో విషయాన్ని కూడా మనం గమనించినట్లయితే కడరా భోజన సమయంలో యేసు రొట్టెను తీసుకొని ఆశీర్వదించి త్రుంచి మొదటగా ఇచ్చినది యూదాకే. మొదటగా రొట్టెను అందుకోవడం ఒక ప్రత్యేక విషయం. ఎందుకంటే యూదా ఆచార ప్రకారం విందు ప్రారంభించిన తర్వాత మొదటి బాగాన్ని అర్పించేది కేవలం ప్రియాతి ప్రియమైన వారికే. ఆ విధంగా మొదటి బాగం ఇవ్వడం ఆ వ్యక్తి యెడల ప్రత్యేక ప్రేమను సూచిస్తుంది. ఇక్కడ కుడా యేసు తాను మొదటగా రొట్టెను

తీసికొని యూదాకు ఇచ్చి తన ప్రేమను చూపించాడు. తద్వారా కనీసం ఈ చర్యద్వారానైనా యూదా తన ప్రేమను తెలుసుకొని హృదయ పరివర్తన చెందుతాడని యేసు ఆశించాడు. మానవుని బలహీనత ఆయనకు తెలుసు. కనుక దయదలిచి ఆయన పాపికి శిక్షకు బదులుగా పరివర్తనను కోరుతాడు కాపరి తప్పిపోయిన గొఱ్ఱెకై వెదకి, అది దొరికినపుడు ఆనందముతో దాన్ని తిరిగి తెచ్చినట్లు దేవుడు పాపికొరకై వెదకి, వాడు పరివర్తన పొందినపుడు ఎంతో సంతోషిస్తాడు. దుడుకు చిన్నవాని తండ్రి తన కుమారుని తిరిగి ఆహ్వానించినట్లు దేవుడు పరివర్తన జెందిన పాపులను ఆహ్వానిస్తాడు.

మనము తప్పుచేసిన వారి యెడల, పాపుల యెడల మన వైఖరి కూడ అలాగే ఉండాలి. అంతేగాక దుష్టులయెడల, మనకు ద్రోహం చేసిన వారి యెడల దయ కనికరం గలిగి, వారిని సరిదిద్దడానికి ప్రయాసపడాలి. వారిని మనం తిరిగి ఆహ్వానించాలి.

## ఉపమాన ముగింపు

ఈ సమాజంలో మంచివారు ఉన్నారు. చెడ్డవారు ఉన్నారు. రాత్రి వేళ పనికట్టుకొని కలుపుగింజలు చల్లినట్లుగా సైతాను మనలను ప్రతి నిత్యం ఏదో ఒక రకంగా శోధిస్తూనే ఉంటుంది. మనం ఒక ముత్యంలా ఉండాలి. ముత్యాన్ని మట్టిలో పడవేసినా ముత్యం లాగానే ఉంటుంది. సూర్యుడు ఎక్కడ ఉన్నా ప్రకాశిస్తూనే ఉంటాడు. కావున మనం ఎక్కడ వున్నా ఎవరి మధ్య జీవించినా దేవునికి  నిజమైన బిడ్డలుగా జీవించాలి. పాపాత్ములను శిక్షంప వచ్చుకదా అని మనలో కొంత మంది వాదింపవచ్చు. కాని దేవుడు యేషయ 55:8-9 వచనాలలో  నా ఆలోచనలు మీ ఆలోచనలు వంటివి కావు. మీ మార్గాలు నా మార్గలు వంటివి కావు అని పలుకుచున్నాడు. ఆకాశము భూమికెంత ఎత్తుగా ఉండునో మీ మార్గములకు, మీ ఆలోచనలకు నా మార్గములు, నా ఆలోచనలు అంత ఉన్నతముగా ఉండును. అంటే ఈ సమాజంలో ఎవరు మంచివారు ఎవరు చెడ్డవారు అని నిర్ణయింపవలసినది మనము కాదు. అది దేవుని పని. కావున పాపాత్ములందరూ హృదయపరివర్తన చెందాలని ప్రార్థంచుదాం అదే విధంగా మంచి పోరాటం పోరాడిన వారికి అనగా, ఈ లోకంలో మంచి

జీవితం జీవించిన వారికి దేవుడు పరలోక రాజ్య బహుమానాన్ని ఒసగుతాడని మరువకూడదు.

❋ ❋ ❋ ❋

# 6. కరుణగల తండ్రి - దారి తప్పిన కుమారులు

- బ్రదర్ కొండెపోగు ప్రేమ్‌రాజ్

## ఉపోద్ఘాతం



యేసుక్రీస్తు కన ప్రసంగాలను ఉపమానాలతో జోడించి చెప్పడం గమనించాలి. అందుకు కారణం ఉపమానాలు, కథలు రూపంలో ఉంటూ, శ్రోతలను ఇట్టే ఆకట్టుకొంటాయి. చెప్పే విషయం సులభంగా అర్థమవుతుంది. భారదేశంలో ముఖ్యంగా మన తెలు ప్రాచీన సాహిత్యంలో "పంచతంత్రము" అన్న గ్రంథముంది. అందులో కథలు, కథలలో ఉపకథలు, అనేక నీతిక కథలుంటాయి. వాటిని చదివే వ్యక్తులకు ఆ సక్తితో బాటు అవి చెప్పే నీతి సులభంగా అర్థమవుతుంది. ఇక్కడ వివరించ బోయే ఉపమానంలో క్రీస్తు ప్రభువు, తండ్రి దేవుడు ఎంత కరుణామయుడో అని వివరించాడు. అలాగే ఆయన కరణను అర్థంచేసుకోని పెద్దకుమారుడు, దుర్వినియోగం చేసుకున్న చిన్న కుమారుడు, చివరికి తండ్రి ప్రేమను అర్థం చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

## దుడుకు చిన్నవాడు

సాధారణంగా చిన్నకుమారుడు కొంచెం దూకుడు స్వభావంతో ఉంటాడని, పెద్దకుమారుడు సౌమ్యంగా ఉంటాడని లోకం పోకడ. ఈ కుటుంబంలో కూడా చిన్నకుమారుడు తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా తన కోరికను వెళ్ళబుచ్చాడు. తనకురావలసిన ఆస్తిని పంచి ఇవ్వమన్నాడు. తండ్రి కాదనలేదు. కానీ ఆ చిన్నకుమారుని తొందరపాటుకు బాధపడి ఉంటాడు. అయినా ఆ వయసులో చెబితే వినే వాళ్ళు చాలా తక్కువ. అందువల్ల ఆస్తిని విభజించి, ఇచ్చేశాడు.

కుమారుని దుడుకతనం, అనుభవ రాహిత్యం ఇక్కడ చక్కగా వివరించబడింది. ఆస్తిని సొమ్ము చేసికొన్నాడు. ధనం వెంట వుండే ఏదైనా చెయ్యవచ్చనుకున్నాడు. చేతిలో ఉన్న డబ్బును హారతి కర్పూరంలా ఖర్చుపెట్టేశాడు. అన్ని వ్యసణాలు వంట బట్టించుకున్నాడు. కూర్చొని తింటే కొండలయినా కరిగిపోతాయ్ కదా! అదే జరిగింది. “తెప్పలుగా చెరువు నిండిన కప్పలు పదివేలుచేరు” అన్నట్లు జులాయిలంతా చుట్టూచేరి ధనమంతా హరించివేశారు. చేతులు ఖాళీ కాగచే మెహంచాటేశారు. కుర్రవాడికి పూటగడవటం కష్టమయింది. సుఖాల్లో తేలియాడినప్పుడు తండ్రి గుర్తుకురాలేదు. కష్టాల్లో పడినపుడు తండ్రి గుర్తుకొచ్చాడు. జరిగినదంతా ఒక కలలా కళ్ళముందు మెదలాడ సాగింది. చివరికి పందులు మేపేందుకు కుదురుకున్నాడు. పందులు తినే తిండికూడా దొరకలేదు. తండ్రి తన పనివాళ్ళను ఎంత ప్రేమగా చూసుకుంటాడో గుర్తుకొచ్చింది. సాధారణంగా మన వ్యక్తిత్వం, మన క్రింది వారితో మనం ఎలా మెలుగుతామో దీనిని బట్టి నిర్ధారించవచ్చు. తన యజమానికంటే తన తండ్రి ఎంత ఉత్తముడో స్ఫురణకు వచ్చింది. తన దుడుకుతనాన్ని సహించాడే కాని, కోపపడ లేదు. తాను ప్రేమగల తండ్రికి ద్రోహంచేశాడు. అందుకని ఆయన క్షమాపణ కోరాలని బయలుదేరాడు. చిన్నకుమారుని పరివర్తనలో స్వార్థంలేదు. కొడుకుగాకాక, పనివాడిగా భావించమని అడుగుదామనుకున్నాడు. అటు దేవుడు, ఇటు దేవుడులాంటి తండ్రి, ఇద్దరికీ తాను ద్రోహంచేశాడు. కనుక పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తండ్రి దగ్గరకు బయలదేరాడు.

## కరుణగల తండ్రి

సాధారణంగా తండ్రికి వయసులో చాలా అనుభవం ఉటుంది. తన జీవితంలో ఎందరినో చూసి ఉంటాడు. ఆ సమయానికి జీవితాన్ని చదివి ఉంటాడు. అందుకని కుమారుని అర్థం చేసుకున్నాడు. చిన్నకుమారుడు తొందర పడుతున్నాడని అర్థమయింది. కానీ అది వినే వయసు కాదు. అనుభవ మయితీనేగని తత్వం బోధపడదు. తల్లిదండ్రులు పిల్లల్ని కంటారుగానీ, వారి బుద్ధుల్ని కాదుకదా! అందుకని కుమారున్ని స్వేచ్ఛగా వదిలాడు. అతని ఆస్తి అతనికిచ్చేశాడు. అందుకు ఆస్తి దుర్వినియోగం అవుతుంది. అయినా ఫర్వాలేదు.

తన కుమారుడు తప్పు తెలుసుకొని జీవితంలో బాగుపడితే అంతేచాలు అనుకున్నాడు. ఇక తన కుమారుని కోసం రోజూ ఎదురుచూడటం ప్రారంభించాడు. చివరికి తన కుమారుడు దురాన్నుండి వస్తుంటే గుర్తుపట్టాడు. తన కుమారుడు ఏ దశలోనున్న తండ్రి గుర్తుపట్టగలుగుతాడు. ఇదీ తండ్రి ప్రేమ. కుమారుడు దగ్గకు రాగానే అతని వేషధారణను పట్టించుకోలేదు. మీద పడి ముద్దపెట్టుకున్నాడు. భావోద్వేహంతో కౌగలించుకున్నాడు. కుమారుడు ఏదో చెబుతున్నాడు. కానీ తండ్రి వినడంలేదు. తన సేవకులతో కొత్త వస్త్రాలుతెమ్మన్నాడు. అవినూతన జీవితానికి నిదర్శనం. ఉంగరం తొడగమన్నాడు. అది తిరిగి కొడుకు పొందే అధికారానికి చిహ్నం. పాదరక్షలు వేయమన్నాడు. ఇక నుండి అతను సురక్షితంగా ఉంటాడు అని దీనికర్థం. క్రొవ్విన కోడెను వధించి విందుచేశాడు. అది సంతోషానికి నిదర్శనం. ఇక్కడ తండ్రి కుమారున్ని ఏ మాత్రమూ తూలనాడలేదు. నిష్టూరంగా మాట్లాడలేదు. అతనితో ప్రేమగా మెదిలాడు. తన సొంత ఇంటికి తిరిగి వచ్చిన అనుభూతిని కలిగించాడు. తండ్రి ప్రేమంటే ఇది. ఈ ఉపమానంలో తండ్రిని ఇంత గొప్పగా చూపడానికి కారణం, తండ్రి దేవుడు తన బిడ్డలయిన మన యెడల ఎంత ప్రేమకలిగి ఉన్నాడో చూపడానికే. ఇదే క్రీస్తుప్రభువు తండ్రి దేవుని ప్రేమను ఆవిష్కరించిన తీరు.

## అర్థం చేసికోని పెద్దకుమారుడు

పెద్దకుమారుడు తండ్రికి విధేయించి ఇంటి వద్దే ఉండేవాడు. పొలం పనులు చేస్తూ తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ ఉండేవాడు. అయితే తన తమ్ముడు ఆస్తిని దుర్వినియోగం చేసినా, తండ్రి అతనిని ఆదరించడం, అదీ గాక సంతోషంతో విందు చేయడం అతనికి నచ్చలేదు. అందుకని అలుక వహించి తండ్రిని నిలదీశాడు. అప్పుడు తండ్రి అన్న మాటలు పరలోక తండ్రి మన పట్ల చూపే వాత్సవ్యానికి నిదర్శనం. నీవు నాతో ఉన్నవుకదా! అప్పుడు నా ఆస్తినీదేకదా! నా సంతోషము, నా దుఃఖము నీవే కదా, అంటూ అనునయించాడు. అదీగాక, తప్పిపోయి తిరిగి వచ్చిన నీ తమ్ముడు దాదాపు చనిపోయి బ్రతికాడుకదా, అంటూ కుమారునికి నచ్చచెప్పాడు. యూదులు

అన్యులను దూరంగా ఉంచడం, క్రీస్తు ప్రభువుకు నచ్చేదికాదు. అందుకని పరోక్షంగా వారికి బుద్ధిచెప్పడానికి కుడా ఈ ఉపమానాన్ని ప్రయోగించాడు యేసుక్రీస్తు. తండ్రి చేసిన దిద్దుబాటును అర్థంచేసుకున్నాడు పెద్దకుమారుడు. తండ్రితో కలసి తన తమ్ముని ఆదరించి విందులో పాల్గొన్నాడు.

**ముగింపు**

నిజానికి ఈ ఉపమానానికి "తప్పిపోయిన కుమారుడు" అన్న పేరు కంటే, "కరుణ గల తండ్రి" అని పిలవడం సముచితం. ఎందుకంటే ఈ ఉపమానంలో ఉథానాయకుడు తండ్రి, చిన్నకుమారుడు కాదు. తన ప్రేమతో, కరుణతో మంచిని కోరుకుంటూ, హితాన్ని ప్రతిపాదిస్తూ, కథలో గొప్ప పాత్ర పోషిస్తాడు తండ్రి. చిన్న కుమారుడు దుడుకు తనంతో, దుష్టత్వంతో ప్రతి నాయకుని పాత్రను పోషిస్తాడు. ఇక పెద్ద కుమారునిది కేవలం ప్రక్క పాత్ర మాత్రమే!

ఈ ఉపమానాన్ని చెప్పడంలోని ఔచిత్యాన్ని గమనించాలి. పరలోక తండ్రి ఔన్నత్యాన్ని ఇంత గొప్పగా ఇంకెవరూ చెప్పలేరేమో! మనుషులు చేసే పొరబాట్లను అర్థంచేసుకుని సరిచేసే తండ్రిలా, తిరిగి అక్కున చేర్చుకునే కరుణామయునిలా ఈ ఉపమానంలో తండ్రి దర్శనమిస్తాడు. ఈ ఉపమానానికి చెప్పిన తరువాత ఇక వ్యాఖ్యానమంటూ ఏదీ అవసరముండదు. వివరణకు తావులేదు. దేవుని ప్రేమను, ఆయన మనసులోని ఔన్నత్యాన్ని చాటి తప్పిన ఈ ఉపమానం, దప్పిదములతో తిరిగి తండ్రి యొద్దకు చేరే మనందరికీ గొప్ప ఉపశమనాన్ని కలిగిస్తుంది.

# 7. భూస్వామి - కౌలుదార్లు

- బ్రదర్ బొచ్చు అమరేందర్

## ఉపోద్ఘాతం



భూస్వామి కౌలుదార్లు ఉపమానం, క్రీస్తుకి మరియు ప్రధానార్చకులకు, ధర్మశాస్త్ర బోధకులకు జరిగిన మధ్య ఘర్షణలకు సమాధానముగా భోధిచడం జరిగింది. ఇంతకి ముందు క్రీస్తు చెప్పిన ఉపమానాలను ప్రజలు అర్థంచేసుకొలేక, దాని బావమును కూడా వివరింపమని క్రీస్తుని అడిగేవారు. కాని ఈ ఉపమానము మాత్రం ఎవరిని ఉద్దేశించి చెప్పాడు అని అచట చేరియున్న ప్రజలకు మరియు మర్రి ముఖ్యంగా యూదా నాయకులకు, ధర్మశాస్త్ర బోధకులకు ఈ ఉపమానము వారిని గూర్చియే అని చాలా క్షుణంగా అర్థంచేసుకొనియున్నారు. ప్రదానార్చకులు, దర్మశాస్త్ర బోధకులు దేవుని పట్ల చివరికి తన పట్ల ఎట్లు ప్రవర్తించియున్నారో! చివరకు తాను ఎట్టి మరణమును పొందబోవుచున్నారో, దేవుడు వారి పట్ల ఎట్లు ప్రవర్తింపనున్నారో, ఈ విషయములను గుర్చి క్రీస్తు ఉపమాన రీతిలో చెప్పియున్నారు.

## ఉపమానములోని పాత్రులు

1. **భూస్వామి** : దేవుడు
2. **దాక్షతోట** : యిస్రాయేలు ప్రజలు
3. **కౌలుదారులు** : ధర్మశాస్త్రబోధకులు, ప్రధానార్చకులు
4. **భూస్వామియొక్క సేవకులు** : వివిధ ప్రవక్తలు
5. **ప్రియమైన కుమారుడు** : యేసుక్రీస్తు ప్రభువు
6. **ఇతర కౌలుదారులు** : అపోస్తులు మరియు ఇతర శిష్యులు, అన్యులు

**(a) గుర్తుంచుకోవాల్సిన విషయములు** : ఆ కాలము నాటి ప్రజల యొక్క

1. సాంఘిక పరిస్థితులు మరియు జీవన విధానం
2. రాజకీయ పరిస్థితులు
3. మత పరమైన ఆచార వ్యవహారములు పరిస్థితులు

**(b) పోలిక** : పాతనిబంధన గ్రంథములో – యెషయా గ్రంథము 5:1–7 మరియు నూతన నిబంధనలోని లూకా సువార్త 20:9–18–19వ వచనము.

యేసు ఈ ఉపమానమును ధర్మశాస్త్ర బోధకులకు మరియు ప్రధానార్చకులను ఉద్దేశించి బోధిస్తున్నది తమను గుర్చియే అని వారికి తెలుసు. ఆ సమయమున సామాన్య ప్రజలు సైతం ఉన్నారు.

**(c) క్షుణ్ణంగా అర్థంచేసుకోవాలంటే** : పూర్వనిబంధలోని యెషయా గ్రంథము 5:1–7లో యావే దేవుడు యిస్రాయేలు ప్రజలను సర్వశక్తి వంతుడైన ప్రభువు దాక్షతోట అని యూదా ప్రజలు అతనికి ప్రీతి గొల్పువనము అనియు, అతడు న్యాయమును అపేక్షించేను గాని ప్రజలు హత్యకు పాల్పడిరి అని అంటున్నారు.

**(d) నూతన నిబంధన – పరిశీలన** : ఉపమానము ఏమనగా ఒక యజమానుడు దాక్షతోటను నాటించి దానిని కౌలుకిచ్చి దేశాటనమునకు బయలుదేరడం. కొంత కాలము గడిచిన పిదప తన భాగమును తెచ్చుటకు పంటకాలమున తన సేవకులను పంపించడం.

**ఉపమాన వివరణ మరియు పోల్చి చెప్పుట – పాత మరియు నూతన నిబంధన ప్రకారం**

**లూకా సువార్త 20:9**

ఒకానొకడు ద్రాక్షతోట నాటించెను. కాపులకు దానిని కౌలుకిచ్చి దేశాటనమునకు వెడలెను. పాతనిబందన గ్రంథంలో చూసినట్లుయితే

యెషయా గ్రంథము 5:7 వచనములో – యిస్రాయేలు జనులు సర్వశక్తిమంతుడైన ప్రభువు ద్రాక్షతోట అని, దేవుడే తన ప్రజల గురించి

వివరిస్తున్నాడు.

యెషయా 27:2 – ప్రభువు తన ద్రాక్షాతోట గూర్చి పాడుట

హోషేయ 10:1 – ఇస్రాయేలియులు చక్కగా పండిన ద్రాక్షతీగవంటివారు.

కీర్తన 80:8 – ఐగుప్తు నుండి నీవొక దాక్షతీగనుగొనివచ్చితివి.

యిర్మియా 2:21 – మంచి విత్తనము నుండి మొలకెత్తిన శ్రేష్ఠమైన ద్రాక్షతీగను నేను మిమ్ము నాటితిని.

ద్రాక్షతోటను దేవుడు యిస్రాయేలు ప్రజలుగా పోల్చిచెబ్బుతున్నారు.

**లూకా 20:10-12** – పంట కాలమున తన భాగమును తెచ్చుటకు కౌలుదారుల యొద్దకు తన సేవకుని పంపెను.

మొదటి వానిని కౌలుదారులు **కొట్టి వట్టి చేతులతో పంపివేసిరి.**

కొంతకాలము గడిచిన పిదప యాజమాని మరొక సేవకుని పంపెను వానిని సైతం **అవమానించి కొట్టి వట్టిచేతులతో** పంపివేసిరి.

మరికొంత కాలము తర్వాత – యాజమానుడు – మూడవ వానిని పంపెను – వారు వానిని గూడ గాయపరచి బయటకు నెట్టి వేసిరి.

ఈ సందర్భములో సేవకులు అనగా ప్రవక్తలు మరియు బోధకులు పరిశుద్ధ గ్రంధములో చెప్పినట్లు **(హెబ్రీయులు 11:32-40) ప్రవక్తలు కొందరు బంధింపబడిరి, కొరడా దెబ్బలు తినిరి, రంపములచే రెండు భాగములుగా కోయబడిరి. కత్తితో సరకబడిరి**

– రాజుల దినచర్యల రెండవ గ్రంధము 24:21 – ప్రజలు జెకర్యా పై కుట్ర పన్నిరి. రాజనుమతిపై అతనిని దేవాలయముననే రాళ్లతో కొట్టిచంపిరి.

**యోహానును శిరచ్ఛేదనము గావించిరి**

– మత్తయి 14:10 సత్యమునకు సాక్ష్యమీయ వచ్చిన యోహాను గారిని తమ స్వపయోజనల కోసం – చెరసాలలో వేసిరి.

ఈ విధంగా ఎందరో ప్రవక్తలను ప్రజలు క్రూరంగా మరణమునకు గురిచేశారు.

మరి ఒక విషయము గమనించాల్సి ఉంది. ఏమనగా ప్రవక్తలు ప్రభువు కొరకు హేళన చేయబడడం కూడా వారి ఆదృష్టంగా భావించారు. అందుకే వారి ప్రాణాలు సైతం లెక్కచేయలేదు.

**లూకా 20:13-15** అంతట యజమానుడు నేను ఏమిచేయవలేను?

అని అనుకొని – నా ప్రియమైన కుమారుని పంపెదను. ఒక వేళ వారు అతనిని గౌరవించవచ్చును అని తలంచెను. సరిగ్గా ఇదే మాట మన తండ్రి దేవుడు తన ప్రియమైన కుమారుడు యేసు క్రీస్తు గూర్చిన విషయాములను మాట్లాడడం వివిధ సందార్భములో చూడవచ్చును.

లూకా 3:22 – "నీవు నా ప్రియమైన కుమారుడవు"

లూకా 20:13 – "నా ప్రియమైన కుమారుడు"

మత్తయి 3:17 – క్రీస్తు ప్రభువు బప్తిస్మము పొందు సమయమున

ఆకాశం నుండి ఒక దివ్యవాణి "ఈయన నా ప్రియమైన కుమారుడు. ఈయనను గూర్చి నేను అధికంగా ఆనందించుచున్నాను." ఈ వాక్యము ద్వారా తండ్రి దేవుడు తన ఏకైక కుమారుని ఎంత గాఢంగా ప్రేమిస్తున్నారో మనం సంపూర్ణంగా అర్థచేసుకొనవచ్చును.

**14వ వచనము :** ఆ కౌలుదారులు అతనిని (కుమారుని) చూడగనే వీడే వారసుడు. వీనిని చంపివేసెదము. 'వీని ఆస్తి అంతయు మనకు దక్కును" అని ఒకరికొకరు చెప్పుకొనిరి.

కొంతమంది వేదాంత పండితులు చెప్పిన విధముగా బహు దూరము నుండి ఆ కుమారుడు రావడం చూసి. వారి తండ్రి మరణించి యుండవచ్చును. కనుక వీనిని చంపివేసినచో. ఈ ఆస్తి అంతయు మనకు దక్కును అని ఊహించియుండవచ్చును. ఎందుకన చాలా సంవత్సరములు గడచి ఉండవచ్చును అని పండితుల అభిప్రాయము. ధర్మశాస్త్ర బోధకులు ప్రదానార్చకులు కూడా ఎన్నో సార్లు క్రీస్తు ప్రభువును తన అద్భుత కార్యములను చూసి చంపివేయుటకు ప్రయత్నించిన సందార్భములు ఉన్నవి.

పరిసయ్యులును, ధర్మశాస్త్ర బోధకులు క్రీస్తు ప్రభుని చూసి లోలోన

తర్కించుకొనసాగడం. తప్పును చూపడం.

లూకా 6:1-5 - క్రీస్తు ప్రభుని పరిసయ్యులలో కొందరు ప్రశ్నించడం.

**15వ వచనము :** కనుక వారు అతనిని తోట వెలుపలికి నెట్టి చంపివేసిరి. ఇపుడు ద్రాక్షతోట యజమానుడు వారిని ఏమి చేయును? రోమీయులు - యూదులు ఆచార సంప్రదాయముల ప్రకారం క్రీస్తు ప్రభుని సిలువ వేసి - మరణమునకు గురిచేసిన స్థలము (గొల్గొతా) అను స్థలము కూడా యెరుషలేమునకు బయట భాగమున ఉన్నది. (వెలుపలి భాగమున ఉంది). ఈ కారణముననే, తన రక్తముచే ప్రజలను పాపమునుండి శుద్ధి యెనర్చుటకు యేసు గూడ నగర ద్వారమునకు వెలుపలనే మరణించెను (హెబ్రీ 13:12).

**లూకా 20:15** "ఆ యజమానుడు వచ్చి ఆ కౌలుదారులను హతమార్చి తన, ద్రాక్షతోటను ఇతరులకు కౌలుకిచ్చును గదా!"

"ఇది విని ప్రజలు అటులెన్నడు జరుగకుండును గాక" అనిరి.

"ఇతరులకు కౌలుకిచ్చును గదా!" దీనికి లోతైన అర్థం దాగియుంది. ఏమనగా ధర్మశాస్త్ర బోధకులు, ప్రధానార్చకులు మరియు యూదులు దేవుడు వారికిచ్చిన అనుగ్రహములను సరైన విదముగా ఉపయోగించు కొనక పైగా వారు క్రీస్తు ప్రభువు మరణమునకు కారణం అయ్యారు. ప్రభువు బోధనలను బోదించారే గాని పాటించలేకపోయారు. కావున ప్రభువు వారిని తొలగించి తన రాజ్య స్థాపనకు, తన ప్రేమ రాజ్య విస్తరణకు, నూతన కౌలుదారులుగా అపోస్తులులను ఎన్నుకోవడం ద్రాక్షతోట స్థానంలో అనగా యిస్రాయేలీయుల స్థానంలో - తన ప్రజలుగా అన్యులను అందరినీ తన ద్రాక్షతోటగా తన వద్దకు చేర్చుకున్నాడు.

**లూకా 20:17-18** ఈ వచనములో క్రీస్తు ప్రభుని గూర్చిన విషయములు నేరవేరుట మనము గమనించవచ్చును. ఏమనగా "ఇల్లు కట్టువారు త్రోసి వేసిన రాయి ముఖ్యమయిన మూలరాయి అయ్యెను. క్షుణ్ణంగా పరిశీలించినట్లుతే లూకా 9:22 - మనుష్య కుమారుడు అనేక శ్రమలను అనుభవించి, పెద్దలచే, ప్రధానార్చకులచే, ధర్మశాస్త్ర బోధకులచే నిరాకరింపబడి చంపబడి, మూడవ దినమున ఉత్థానమగుట అగత్యము.

లూకా 17:25 ఈ తరము వారిచే నిరాకరింపబడవలెను – ఇంక ఎన్నో సందార్భములలో ప్రజలచే నిరాకంరిపబడినను చివరకు తనను ఎవరైయితే నిరాకరించారో మరణామునకు గురిచేశారో తిరిగి మరల వారికోసమే లేచి వారికి ఒక మూలరాయిగా మారెను మన క్రీస్తు ప్రభువు.

కీర్తన 118:22 – ఇల్లు కట్టువారు పనికిరాదని నిరాకరించిన రాయియే మూలరాయి అయ్యేను.

యెషయా 8:14 – నా పావిత్ర్యము వలన నేను ప్రజలు తట్టుకొని పడిపొవు రాయి వంటి వాడనగుదును.

యేసు క్రీస్తు ప్రభువు తన నిరాకరణను సైతం తన పరలోక తండ్రి చిత్తమును నెరవేర్చుటయే అని – ప్రేమతో ఎదుర్కొన్నాడు.

ఎందుకన పరిశుద్ధ గ్రంథము పలుకుచున్నట్లుగా యేసు ప్రధానార్చకులచే, దర్మశాస్త్ర బోధకులచే నిరాకరింపబడవలెను అనిన సత్యం ఇచ్చట నెరవేరెను.

**లూకా 20:18** ఎవడు ఈ రాతి మీద పడునో వాడు తునాతునకలగును. ఎవనిపై ఈ రాయి పడునో వాడు నలిగి నుగ్గగును.

క్రీస్తు ప్రభుని నిరాకరించేవాళ్ళు నాశనమౌతారు. అతడు వాళ్ళకు పడిపోయే రాయిలాంటివాడు అవుతాడు. అనగా వారి పతనాకి కొరకుడౌతాడు అని బావం. వారు దేవుని తీర్పుకు గురౌవుతారని దీని అర్థం.

యెషయా 5:15 – ప్రభువు గర్వాత్ములను అణచివేయును.

లూకా 2:34 – ఇచ్చుట సిమియోను క్రీస్తు ప్రభుని గురించి చెప్పిన ప్రవచనములు నేరవెరుతున్నాయి. ఏమనగా “ఇదిగో! ఈ బాలుడు యిస్రాయేలియులలో అనేకుల పతనమునకు, ఉద్ధరింపునకు కారకుడు అగును. ఇతడు వివాదా స్పదమైన గురుతుగా నియమింపబడియున్నాడు.”

చివరకు “ఈ ఉపమానము విని అది తమను గురించియే అని ధర్మశాస్త్ర బోధకులు, ప్రధానార్చకులు గ్రహించారు.”

## ముగింపు

యిస్రాయేలు యొక్క నాయకత్వ బాధ్యతలను దేవుడు దర్మశాస్త్ర మరియు ప్రధానర్చకుల వద్దనుండి తీసివేసి తన పన్నెండు మంది అపోస్తులకు అప్పగించడం జరిగింది. ఎందకన యూదులు, దర్మశాస్త్ర బోధకులు వారి న్యాయకత్వంలో దేవుని వరాలను తమ స్వలాభం కొరకు వినియోగించుకున్నారు.

ప్రస్తుత సమాజంలో జీవిస్తున్న మనం మన సేవ పిలుపుకు అనుగుణంగా జీవించి మంచి ద్రాక్షఫలలాను ఇతరులకు అందిద్దాం.

❋ ❋ ❋ ❋

# 8. విత్తువాని ఉపమానము

– బ్రదర్ రుద్రపాటి ప్రవీణ్ కుమార్

## ఉపమాన పరిచయం



యేసు సుదీర్ఘమైన ఉపన్యాసాలీయలేదు, అనర్గళమైన ప్రభోదాలు చేయలేదు. ఆయన ప్రజల బాషలో, ఎప్పుడూ ప్రజల జీవితంలో ఉండే పశువులను, పక్షులను, జంతువులను పంట పొలాలను రైతులను పాత్రలుగా ఎంచుకొని ఉపమానాల ద్వారా సామెతల ద్వారా, కథల ద్వారా ఉపదేశించారు. దైవరాజ్యం ఎలా ఉంటుందో తెలియజేయడమే క్రీస్తు ప్రభువు యొక్క ముఖ్య ఉద్దేశం.

ఈ విధంగా యేసు చెప్పిన ఉపమానాలలో పరలోక రాజ్యం గురించి వివరించిన ఒక గొప్ప ఉపమానం విత్తువాని ఉపమానం. ఇది ప్రజలకు గొప్ప నమ్మకాన్ని కల్గిస్తుంది. ఈ ఉపమానంలో చాలా విత్తనాలు వ్యర్థమయ్యాయి. కొన్ని రాతినేలలో, త్రోవ్రక్రపక్కన, ముళ్ళపొదలలో పడి ఫలించకపోయినా, మంచి నేలలో పడిన విత్తనం నూరంతలుగా ఫలించుట జనులకు గొప్ప ఆశనిస్తుంది. దేవుని రాజ్యం కోసం భక్తితో ఎదురుచూస్తే ఎన్ని కష్టాలు ఇబ్బందులు ఇక్కట్లు ఎదురైనా అంతిమ విజయాన్ని సాదించగలుగుతారు.

## ఉపమాన చరిత్ర

### పాలస్తీన దేశ పరిస్థితులు మరియు సువార్తీకుల అవగాహన

విత్తువాని ఉపమానాన్ని మనం మూడు సువార్తలలో చూడవచ్చు. అవి మత్తయి, మార్కు, మరియు లూకా సువార్తలు. ఈ సువిశేషకులు ఈ ఉపమానాన్ని వారివారి ప్రజలకు అనుగుణంగా రాశారు. అందుకనే మనకి

కొన్ని మార్పులు (తేడాలు/భేదాలు) కనిపిస్తాయి. ముందుగా పాలస్తీన దేశపు భౌగోళిక పరిస్థితులను అక్కడి వాతావరణాన్ని పరిశీలించినట్లయితే దేశమంతా పర్వతాలు, కొండలు, లోయలు, ఎగుడు, దిగుడు నేలలు ఉన్న ప్రదేశం. మన వ్యవసాయ పద్ధతికి వారి వ్యవసాయ పద్ధతికి చాలా భేదం ఉంటుంది. మనం నాగలితో విత్తనాలు విత్తుతాం, కానీ పాలస్తీనా దేశంలో చెడుగా ఉన్న భూమిలో విత్తనాలు చల్లి తర్వాత ఆ భూమిని దున్ని చదును చేస్తారు. అప్పుడు ఆ విత్తనాలు భూమిలోపల మట్టితో కప్పివేయబడి మొలకెత్తుతాయి.

పాలస్తీన దేశంలో రెండు రకాల ప్రజలు ఉన్నారు. క్రీస్తు మెస్సయ్యగా అంగీకరించిన వారు, మరియు అంగీకరించనివారు. క్రీస్తు ఆయన బోధనలను ఆలకించి ఆయన అద్భుతకార్యాలను చూసి కొందరు ఆయనే రక్షకుడని నమ్మి ఆయనను అనుసరిస్తే, మరికొందరు ఈయన వడ్రంగి కాడా ఇంత జ్ఞానం ఎలా వచ్చింది అని తిరస్కరించారు. ఈ రెండు వర్గాల వాళ్ళే కాక అనేక మంది యేసు బోధలను ఆలకించారు, వారికి కూడా సులభంగా అర్థం కావాలి అని క్రీస్తు పరలోక రాజ్యాన్ని ఉపమానాలతో బోధించారు.

## ఉపమాన వివరణ

విత్తువాని ఉపమానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. దైవరాజ్య బోధనంతా ఈ ఉపమానంలో ఇమిడివుంది. ఈ ఉపమానంలో అర్థం ఈ విధంగా వుంది. విత్తనం దేవుని వాక్యం, విత్తువాడు క్రీస్తు, నాలుగు రకాల నేలలు నాలుగు స్వభావాలున్న మనుషులకు గుర్తు. ఈ ఉపమానంలో అన్ని విత్తనాలు ఫలించలేదు. అంతేకాక సారవంతమైన నేలలో పడిన విత్తనాలు కూడా సమానంగా ఫలించలేదు. అలానే బోధించినదంతా నెరవేరుతుందని ఫలిస్తుందని చెప్పలేం. దేవుని వాక్కును ఆలకించేవారికి చాలా ఆటంకాలు ఎదురౌతాయి. కానీ వాటిని అన్నింటిని ఎదుర్కొని నిలబడినవారే, సారవంతమైన నేలలోపడిన విత్తనంలా ఫలిస్తారు.

## ఎ) త్రోవ ప్రక్కన పడిన విత్తనాలు

కొందరు త్రోవ ప్రక్కన పడిన విత్తనాలను పోలినవారు. దేవుని వాక్కు అను విత్తనము వారియందు విత్తబడుచున్నది. కాని దానిని వినిన వెంటనే

సైతాను వచ్చి దానిని ఎత్తుకొనిపోవును. ఆ త్రోవప్రక్కన పడిన విత్తనాన్ని పోలిన వారిని గురించి అర్థం చేసుకొనుటకు మనకు కొంతవరకు వ్యవసాయం మీద పొలం మీద అవగాహన ఉండాలి. ప్రతి పొలంలో త్రోవవుంటుంది (అంటే దారి). ఒక పొలం నుండి వేరొక పొలానికి కూలీలు వెళ్లడానికి, పంటకాలంలో ఎడ్లబండ్లూ ఇతర వాహనాలు వెళ్ళడానికి ఈ త్రోవ అవసరం. ఆ ప్రాంతంలో పంట దిగుబడి తక్కువగా ఉంటుంది. ఎందుకంటే వచ్చేపోయేవాళ్ళతో ఆ ప్రాంతం బండబారిపోతుంది. పక్షులు, జంతువులు, అనేకం ఆ తోవలోనే విశ్రమిస్తుంటాయి. ఈ త్రోవలో పడిన విత్తనాన్ని, పోలిన ప్రజలు ఎప్పుడు కూడా శోధనలలో, లౌకిక వ్యామోహాలతో మునిగి ఉంటారు. సైతాను వారు విన్న వాక్కును త్రోవ ప్రక్కన పడిన విత్తనాన్ని పక్షులు తినివేసినంత సులభంగా దొంగిలించుకొనిపోతుంది. వాక్కును ఆలకించిన వెంటనే శోధనలకు గురవ్వడం, కలహాలతో చిక్కుకోవటం వలన అ వాక్కును పెడచెవిని పెట్టడం జరుగుతుంది. కనుక ఇటువంటివారు పరలోకాన్ని పొందలేరని క్రీస్తు బోధిస్తున్నారు.

## బి) రాతినేలలో పడిన విత్తనాలు

రాతినేలపై మట్టి ఎక్కువగా ఉండదు కాబట్టి విత్తనాలు నాటుకోవటం కష్టం. గాలి వానకు కొట్టుకపోతాయి. ఎండ వేడికి తట్టుకోలేవు. అయితే కొన్నైనా మొలవవచ్చు. కాని అవి ఎంతకాలం బ్రతికి ఉంటాయో చెప్పలేం. దీని పరిస్థితి కొంత మెరుగు. వీరు దేవుని వాక్కును వినిన వెంటనే సంతోషముతో స్వీకరింతురు. కాని వారిలో వేరు లేనందున కొద్ది కాలం మాత్రమే నిలుస్తారు. ఈ విధమైన మనుష్యులు తమ పాపపు జీవితంతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో సువార్తను ఆలకిస్తారు. అది వారికి ఎంతో ఊరటను ఇస్తుంది కానీ వారిలోని పాపం చెడు గుణాల వలన వారిలో ఒక విధమైన ఆవేధన మొదలవుతుంది. మనస్సు ఆత్మలపై పాపం గెలచి వారిని వాక్యం ప్రకారం జీవించకుండా చేస్తుంది. ఇటువంటి వారు కూడా పరలోక రాజ్యాన్ని పొందలేరు అని ప్రభు బోధిస్తున్నారు.

## సి) పొదలలో పడిన విత్తనాలు

ముండ్ల పొదల్లో పడిన విత్తనాలు, వాటి గతి కూడా దాదాపు అంతే ఉంటుంది. ఇచ్చట విత్తనం ప్రాణం పోసుకుంటుంది. దానితో పాటు ప్రక్కన ఉన్న ముండ్ల పొదలు గూడా పెరిగి దీన్ని అణచి వేస్తాయి. పై రెండు రకాల విత్తనాల కన్నా దీని స్థితి మరి కొద్దిగా నయం. కానీ దీని గతి కూడా చివరకు వాటి లాగానే అంతమవుతుంది. దీనిలో సరిపడా బలం లేదు. కావున అవి వాటి దౌర్భాగ్యాన్ని కొని తెచ్చుకుంటాయి. వీరిలో ఉన్న ధన వ్యామోహం పదవీ వ్యామోహం, సంఘ ప్రతిష్ట, పలుకుబడి మొదలైన స్వార్థపూరితమైన గుణాలు వారు ఆలకించిన వాక్కును అణచివేస్తాయి. కాబట్టి వీరు కూడా పరలోక రాజ్యన్ని పొందలేరు.

## సారవంతమైన నేలలో పడిన విత్తనాలు

సారవంతమైన నేలమీద పడ్డ మంచి విత్తనం మానవ హృదయాలను నీతి, సత్యం వైపు మళ్ళిస్తుంది. దేవుని వాక్కువైపు స్పందింప చేస్తుంది. ఈ స్పందన పరలోక రాజ్యాని వెతకడానికి ప్రోత్సహిస్తుంది. క్రీస్తుని పట్ల శిష్యత్వాన్ని దృఢపరుస్తుంది.

వీరు వాక్యాన్ని వింటారు, ఆలకిస్తారు, అంగీకరిస్తారు మరియు వారి జీవితాలలో ఆచరిస్తారు. అది ముప్పదంతలుగా, అరువదంతలుగా నూరంతలుగా ఫలిస్తుంది. ఈ వర్గపు ప్రజలు దేవుడే తమకు సమస్తమని బావిస్తారు. కావున వీరు పరలోక రాజ్యంలోనికి ప్రవేశించడానికి అర్హులు అని ప్రభువు బోధిస్తున్నారు.

పై ఉపమానంలోని ప్రతీ వాక్యాన్ని లోతుగా పరిశీలించాలి. దేవుని రాజ్యాన్ని స్థాపించాలి అంటే నేలను పదును చేసుకోవాలి. రాయిరప్పలను పెకిలించి, తొలగించాలి, గుంతలను పూడ్చాలి. అయినా విత్తనాలు సారవంతమైన నేలలో పడతాయో లేదో తెలియనప్పటికి ఆశాజనకంగా స్పందిచే వారికి ప్రతిఫలం ఉంటుంది. అయితే అందరూ ఒకే రకంగా స్పందించాలని ఏ షరతు లేదు. ఎత్తు పల్లాలు ఉంటాయి. క్రీస్తుకి అన్నీ సవ్యంగా సాగలేదు కానీ అంతిమ ఫలితం పునరుత్థానం మోక్షారోహణం. ప్రతీ క్రైస్తవుడు క్రైస్తవరాలు

తన హృదయాన్ని సాగుచేసుకోవాలి. క్రైస్తవుడు గోదుమ పొట్టువలే కాకుండా గోదుమ గింజలాగా తయారవ్వాలి.

మనం ఏ రకమయిన భూమిలో పడిన విత్తనంలా ఉన్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. క్రీస్తు కూడా ఎన్నో ఇబ్బందులను ఇక్కట్లను ఎదుర్కున్నారు. చివరకు ఆయన గమ్యాన్ని చేరుకున్నారు. దైవరాజ్యాన్ని స్థాపించారు. అది ఇప్పటికీ ప్రపంచమంతా వ్యాపిస్తునే ఉంది.

# 9. ఇరుకు ద్వారం

– బ్రదర్ ఈరి పవన్ కుమార్

## ఉపమాన పరిచయం



పునీత లూకా గారు సువార్తను వ్రాయడంలో ప్రత్యేక దృక్పథాన్ని మరియు ఉద్దేశాన్ని కలిగియున్నాడు. లూకా గారు తన సువార్తను ప్రధానంగా అన్యుజనులను ఉద్దేశించి, మరియు యేసు క్రీస్తును యూదులు మరియు అన్యుల రక్షకునిగా లిఖించడం జరిగింది. పునీత లూకా గారు మనకి యేసు చెప్పిన ఎన్నో ఉపమానములను వ్రాసినప్పటికీ, అందులో ప్రత్యేకమైన ఒక ఉపమానము ఉంది అని చెప్పవచ్చు. అదియే ఇరుక ద్వార ఉపమానం. ఈ ఉపమానమునులో దీని ప్రాముఖ్యతను లిఖిస్తూ ఇది దేవుని రాజ్యానికి మార్గమని సూచించారు. చాల మంది లోపలికి ప్రవేశించడానికి ప్రయత్నిస్తారు కాని ప్రవేశించలేరు, అని యేసు హెచ్చరించారు. అలాగే సమాజంలో చివరిగా పరిగణించబడే, కొందరు దేవుని రాజ్యంలో మొదటి వారౌతారని, మొదటి వారు చివరి వారు అవుతారని కూడా పునీత లూక గారు ఈ ఉపమానంలో మనకు తేటతెల్లం చేస్తున్నారు. మన హృదయాలను పరిశోధించమని మరియు దేవుని రాజ్యంలో ప్రదేశించడానికి, ప్రయత్నించడానికి ప్రోత్సాహించే ఆలోచనాత్మకమైన ఉపమానం ఈ ఇరుకు ద్వారం ఉపమానం.

## ఉపమాన చారిత్రకత

రక్షణ ప్రణాళికను గూర్చిన విశాల దృక్పథాన్ని మరియు యూదుల సంకుచిత మనస్తత్వాన్ని దేవున్ని సొంత చేసుకోవాలన్న స్వార్ధపుటాలోచనను మనము పవిత్ర గ్రంధము నందు అనేక చోట్ల ఎదుర్కొంటాము. తమ జాతిని

దేవుడు ప్రత్యేకించి దేవుడు ఎన్నుకున్నారు కాబట్టి దేవుని శక్తియుక్తులు అన్నీ తమకే స్వంతమని మెస్సయ్య ద్వారా తండ్రి దేవుడు ప్రసాదించనున్న రక్షణ కేవలం తమ సొత్తు అని ఆ భాగ్యాన్ని ఎవరు తమ నుండి తీసివేయలేరని యూదులు భ్రమపడుతూ ఉండేవారు. ఈ సమస్య ఆ కాలంలో యూదుల మధ్య తరచుగా ఉండేది. మనిషి ఎలా జీవించినా యూదా జాతికి చెందిన వాడైతే తప్పక రక్షింపబడతాడనే గుడ్డి నమ్మకం ఉండేది. యేసు అగు నమ్మకాన్ని వమ్ము చేయదలచి, అందరు ఇరుకైన ద్వారము గుండ ప్రవేశించాలని, ప్రయత్నించాలని బోధిస్తు ఈ ఇరుకు ద్వారం ఉపమానం చెప్పడం జరిగింది.

**ఉపోద్ఘాతం**

'కష్టే ఫలి', అవును ముమ్మాటికి ఇది నిజం. జీవితంలో ఏదైనా సాధించాలంటే దానికి తగిన కృషి ఎంతైనా అవసరం. ప్రయత్నం లేకుండ ఫలితం ఉండదు. మనం ఒక అంతస్తును చేరుకోవాలంటే దానికి ఎంతో కష్టపడి చెమటోడ్చి కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఒక సాధారణ వ్యక్తి ఉన్నతమైన ఉద్యోగాన్ని పొందాలంటే ముందుగా ఎంతో క్రమ శిక్షణ కలిగి, కష్టపడి, చదివి, దానికి తగిన సమయాన్ని హెచ్చిస్తూ నియమ నిబంధనలను పాటిస్తూ, త్యాగపూరితమైన జీవితం జీవిస్తూ, తన ఆశయం సిద్ధించే వరకు కృషి చేయాలి. అప్పుడే అతడు/ఆమె ఫలితాన్ని పొందుతారు. మన జీవితానికి కూడ ఒక ఉన్నత అంతస్తు ఉంది. ఆదియే రక్షణ అంతస్తు. ఈ రక్షణ అంతస్తు అంత సులభం కాదు. అంత సులభంగా లభింపదు. ఎందుకంటే ఇది ఒక ఇరుకు ద్వారం, కరకు మార్గం. అనేక మంది ఆ ద్వారమున ప్రవేశించటానికి ప్రయత్నిస్తారు గాని అది అందరికీ సాధ్యపడదు. కొంతమందికే సాధ్యం. ప్రయత్నాలలో అనేక రకాలు ఉన్నాయి. కొందరు సోమరితనం వలన చాలించకుంటారు. మరికొందరు కొంత కష్టపడి మార్గమధ్యంలో తమ ప్రయత్నాన్ని విడనాడుతారు. మరి కొందరు ఎన్ని కష్టాలు ఆటంకాలు ఎదురైనప్పటికీ, అన్నింటినీ ఓర్పుతో భరిస్తూ కార్యదీక్షతో ఫలితం పొందే వరకు ప్రయత్నిస్తారు. యేసు ప్రభువు కోరేది ఇలాంటి గట్టి ప్రయత్నమే.

## రక్షణ కొంతమందికి మాత్రమేనా?

ఒకరోజు యేసు ప్రభువు యెరుషలేం వెళ్తుండగా ఒక వ్యక్తి ఆయన్ని సమీపించి రక్షణ పొందువారు కొద్దిమంది మాత్రమేనా అని అడిగాడు. ఈ ప్రశ్న యూదా మతస్తుల మనస్తత్వాన్ని ప్రతిభింబిస్తుంది. ఎంత మంది రక్షణ పొందుతారు, ఎవరు రక్షణ పొందుతారు అనే సమస్య ఆ కాలంనాటి నుండే ఉంది. అయితే యూదా జాతికి చెందిన వారంతా దేవుని బిడ్డలని, అబ్రహాము ఇస్సాకు, యాకోబు తమ పితరులు అని గొప్పలు చెప్పుకుంటూ, రక్షణ తమ స్వంతమేనని బలంగా నమ్మేవాళ్లు. ఉపమాన చారిత్రకతలో చెప్పబడిన విధంగా ఆ కాలంలో మనిషి ఎలాంటి దుర్భరమైన జీవితాన్ని జీవించినా యూదా జాతికి చెందిన వాడైతే వారు తప్పక రక్షణలో పాలుపంచుకుంటారని భ్రమలో జీవించేవారు. కావున యేసు ఈ మూఢ నమ్మకాన్ని వమ్ము చేయదలచి, మెస్సయా రక్షణలో ఒక ఇస్రాయేలీ ప్రజలే గాక మానవులందరు బాగస్తులవుతారని, మానవులంతా దేవుడు ప్రసాదించే రక్షణను పొందటానికి పిలువబడ్డారని, భయభక్తులు కలిగి జీవించే వారంతా దేవుని శిక్షకు గురికాకుండా రక్షణ పొందుతారని తెలియజేస్తున్నారు.

## నామకార్థపు క్రైస్తవులమా ?

ఆ వ్యక్తి అడిగిన ప్రశ్నకి యేసు ప్రభువు ప్రత్యక్షంగా సమాధానం చెప్పలేదు. దానికి బదులుగా యేసు “ఇరుకైన ద్వారమున ప్రవేశింపుము” అని సమాధానం ఇస్తారు. అనేకులు ఆ ద్వారమున ప్రవేశింప ప్రయత్నింతురు. కాని అది వారికి సాధ్యపడదు అని తెలిపారు. ఇక్కడ యేసు ప్రభువు ఆ వ్యక్తి అడిగిన ప్రశ్న కొద్ది మందే రక్షణ పొందుతారా అనే దానిని దృఢపరచలేదు త్రోసిపుచ్చలేదు. ఇక్కడ యేసు ప్రభువు చెప్పేదేమిటంటే రక్షణ అనేది ఎవరికి దారాదత్తం చేయబడుదు అని. మరి రక్షణ ఎలా పొందాలి? ఎలా సాధ్యం అవుతుంది? కేవలం ఇరుకు మార్గం గుండా ప్రయాణించినపుడే అది సాధ్యం అవుకుంది

ఒకసారి ద్వార మూసి వేయబడిన తరువాత ప్రవేశించడం అసాధ్యం. మనం ఎంతగా ప్రయత్నించినా సరిపడదు. తలుపు తడుతున్న వారు “మీతో అన్న పానీయములు పుచ్చుకొంటిమి, మా వీధులలో మీరు బోధించిరి” అని

చెప్పనారంభింతురు అపుడు యేసు “మీరు ఎచ్చటి నుండి వచ్చితిరో నేను ఎరుగను నా నుండి వైదొలగుడు” అని చెప్పును (లూకా 13:27) . కావున ఇక్కడ మనం ఏమి అర్థం చేసుకోవాలంటే యేసుని ఆలకించడం, ఆయనను భుజించడం, బాహ్యమైన సంబంధం కలిగి ఉండటం మాత్రమే కాదు. అది మాత్రమే సరిపోదు, కాని యేసుని చివరి వరకు ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ వెంబడించడం మరియు తోటి సహోదరీ సహోదరులతో సన్నిహితంగా జీవించడం.

## మన కర్తవ్యం

మనకు శ్రీసభ నేర్పించేదేంటంటే చావైన పాపం లేకుండ దేవుని అనుగ్రహంతో చనిపోయిన వాళ్ళు రక్షింపబడతారు అని. మరో మాటలో చెప్పాలంటే రక్షంపబడటం అంటే దేవునితో, తోటి మానవులతో సఖ్యత కలిగి జీవించడం మరియు మరణించడం. ఇది అంత సులభం కాదు. యేసు ప్రభువు లాగా తోటి సహోదరీ సహోదరులను ప్రేమించి వారి కోసం ప్రార్థించడం మనల్ని రక్షణకు అర్హులను చేస్తుంది. మీరు ఒకరినొకరు ప్రేమించునప్పుడే నా శిష్యులని లోకం గుర్తిస్తుంది (యోహాను 13:35) అని యేసు ఈ ఉద్దేశంతోనే అన్నారు. మనలో చాలా మంది యేసు ప్రభువు ప్రేమామయుడని దయాపూరితుడని ఆయన భయకంపితుడు కాదని భావిస్తుంటాం. ఆయన మన బలహీనతలను అర్థం చేసికుంటారనీ, మన పాపములను తన అమూల్యమైన ప్రేమ చేత మన్నిస్తారనీ నముతున్నాము. నిజమే, యేసు ప్రభువు పరిపూర్ణ ప్రేమకలవాడు దయాపూరితుడు. మరి ఆయన ప్రేమను ఎంతమంది తెలుసుకుంటున్నాం? యేసుని గూర్చిన జ్ఞానం, దాని అవగాహణ ఎంతమందికి ఉంది?

ఆయన ప్రేమను, దయను గ్రహించిన వాళ్లు ఆయన ప్రేమచే ఆకర్షితులైన వాల్లు ఆయనే సత్యం, జీవం మార్గమని (యోహాను 14:6) నమ్మి ఆయన చూపించిన ఆదర్శంలో జీవిస్తారు. ఆయన జీవితాన్ని తమదిగా చేసుకొని అటు దేవునితో ఇటు మానవులతో సోదర భావంతో జీవిస్తారు. అలా యేసు ప్రేమ పూరితుడు అని చెప్పుకుంటూ ఆయన ద్వారం వేరు నా మార్గం వేరు అయినా,

ఆయన నన్ను రక్షిసారు అని భావించడం మూఢ నమ్మకం, మూర్ఖత్వం అవుతుంది. (యూదులు సైతం అలానే అనుకున్నారు. మనిషి ఎలా ఉన్నా, ఏ విధంగా జీవించినా ఫర్వాలేదు, యూదా జాతికి చెందిన వాడైతె చాలు రక్షణ పొందవచ్చు అని).

కావున దేవుని రాజ్యం అందరికీ అందుబాటలోనే ఉంది. ఎవరైతే ప్రేమతో మరియు దేవుని వాక్యాను సారము జీవిస్తారో వారు మాత్రమే అందులోకి ప్రవేశిస్తారు. అందులో ఎటువంటి సందేహం లేదు. అబ్రహాము, ఇస్సాకు, యాకోబులు, ప్రవక్తలందనిజూ పరలోక రాజ్యంలో ఉన్నారు (లూకా 13:28). ఇంకా వివిధ దేశాల నుండి ప్రజల దేవుని రాజ్యంలో ప్రవేశిస్తారు అని యేసు అంటున్నారు. దేవుని రాజ్యం ఎక్కువగా విస్తరిస్తుంది (లూకా 13:29). దేవుని రాజ్యం ఒక్క వర్గానికో కాదు, అందరికి ఉందని ఉపమాన పూర్వకంగా తెలియజేసారు. గుర్తించుకో వలసిన, విషయం ఏమిటంటే రక్షణ దాని అంతట అది రాదు. దాని కోసం కృషి చేయాలి. కాబట్టి కృషి చేస్తే కడపటి వారు మొదటి వారు అవుతారు లేకపోతే కడపటి వారి గానే మిగిలిపోతారు (లూకా 13:30).

❋ ❋ ❋ ❋

# 10. లోభివాని ఉపమానము

- బ్రదర్ కొమ్మెర పవన్

## ఉపోద్ఘాతం



ప్రపంచం మొత్తం ఒకే సూత్రం మీద నిలబడి ఉంది అది "ధనం మూలం మీదం జగత్", అంటే ప్రపంచం మొత్తం డబ్బు మీదే నడుస్తుంది లేదా ప్రపంచం డబ్బుపై అధారపడింది. ధనం, అస్తులు, ఐశ్వర్యాలు అనేవి మన అవసరానికి కావాల్సిన మెత్తం ఉంటే చాలు అత్యాశకు పోతే "దురాశ దుంఖఃనికి చేటు అవుతుంది". ఇశ్రాయేలు ప్రజలకు మోషే ఇట్లు అజ్ఞాపించాడు. ఏ రోజుకు కావాల్సిన మన్నా సరిపడేంత తీసుకోమని కాని వారిలో కొందరు మోషే మాటవినరైరి. వినకుండా మరునాటికి కొంత అట్టిపెట్టుకొనిరి. అది పురుగుపట్టి కంపుకొట్టెను (నిర్గమ 16:19-20). అలాగే ఎలీషా సేవకుడు గేహాసీ ఏమాయెను? తాను ధనం కోసం, బంగారు, వెండి, పట్టు వస్త్రాల కోసం, అత్యాసపరుడైనందున తాను శాపమునకు గురియై కుష్టరోగము తెచ్చుకొనెను (2 రాజుల రెండవ గ్రంథము 5:320-27). ఇక మనము నూతన నిబంధనలోకి వెళితే యూదా ఇస్కారియోతు పేరాశకు పోయి తన గురువును 30ది వెండినాణెములకు అమ్మి చివరికి మనశ్శాంతి లేక ఉరి వేసికొనెను (మత్తయి 27:3-5). పవిత్ర గ్రంథము నిశ్చయముగా చెప్పుచున్నది. ఏనాడైతే నీవు ప్రాపంచిక వస్తువుల పట్ల అశ గొనియుంటావో నీ పతనానికి నీవే కారణమవుతావు. ఇది మన లోభి వాని ఉపమానములో స్పష్టముగా బహిర్గతమౌతుంది.

## సందర్భం

ఈ ఉపమానము జనసమూహము నుండి ఒకరు అడిగిన ప్రశ్నతో

మొదలవుతుంది. "బోధకుడా పిత్రార్జితమున నాకు పాలుపంచమని నా సహోదరునితో ఒక మాట చెప్పుము అనెను ఇలా క్రీస్తు ప్రభువు లోకసంపదల గూర్చి వివరిస్తూ ఆనాటి సామాన్య ప్రజలకు మరిముఖ్యముగా అపోస్తులులకు అర్థం అయ్యేరీతిలో లోభివాని ఉపమానము చెప్పారు. ఈ ఉపమానము చిట్ట చివరగ ఇలా ముగుస్తుంది, "మీ సంపలు ఉన్న చోటనే మీ హృదయముండును (లూకా 12:34). మరి క్రీస్తు ప్రభువు అందరినీ ప్రశ్నిస్తున్నారు. మీ హృదయాలు ఎక్కడ నెలకొనియున్నాయి? నాలుగు సువార్త పఠనాలలో, లూకా సువార్తలో ముఖ్యముగా 12వ అధ్యాయములోనే వేలాది ప్రజలు గుమిగూడి త్రొక్కిసలాడుచున్నారని తెలియపరుస్తుంది (లూకా 12:1). ఏడు చావైన పాపలలో ఒకటయైన "అత్యాశ" గూర్చి ప్రభువు వివరించారు.

## నేటికి కావలసిన ఆహారము

నేటికి కావలసిన మా అనుదిన ఆహారమును మాకు దయచేయుము క్రీస్తు ప్రభువు పరలోక ప్రార్థనలో తెలియజేశారు (మత్తయి 6:11). దీనికి అర్థం ఏమిటంటే పరిపూర్ణమైన విశ్వాసం అందరం కలిగి ఉండటం. మనకు అధిక మోతాదులో డబ్బు, ఆహారం, బంగారం, ఇంకా ఏమి ఉన్నను మనకు మనము గర్వముతో తాండవిస్తాము. ఎందుకంటే రేపటిని గూర్చి ఆలోచించకు, సకలమును ప్రోగు చేసుకొనక దృఢమైన విశ్వాసము కలిగి ఉంటే ప్రభువే వాటిని దయచేస్తారు. ఆకాశపక్షులకు, అడవిలోని జంతువులకు, సకల ప్రకృతికి ఆధారభూతుడు ప్రభువు కనుక ఆత్యాసతో సొమ్మును దాచుకుంటే నీకు నువ్వ తండ్రికి దురమవుతావు.

## నేను, నాకు, నీతో, నా

ఈ ఉపమనమును క్షుణ్ణంగా ధ్యానించినట్లైతే ధనవంతుడు వాడిన నాలుగు పదాలు తనను తాను స్వీయ కేంద్రికృతం చేసుకున్నట్లు తెలుస్తుంది. నేను, నాకు, నా, నాతో అను పదాలు మన జీవితంలో ఉన్నట్లయితే రెండు విషయాలను మనం గాలిలో వదిలివేస్తాము. మొదటిది దైవ ప్రేమ (మత్తయి 22:37). రెండవది సోదర ప్రేమ (మత్తయి 22:38). ఈ రెండిటిని మరిచి, విడచినవాడు ఈ లోకానికి, పరలోకానికి సంబందినవాడు కాదు. ఎందుకంటే ఒక మనిషికి

ప్రతి ఒక్కటి సమృద్ధిగా ఉండుట చేత మొదటి మూడు ఆజ్ఞాలను విస్మరిస్తాడు నేనే మీ దేవుడను. మీకు నేను తప్ప మరొక దేవుడు లేడు (నిర్గమ 20:2-3). కాని అన్ని పరిపూర్ణంగ, సమగ్రంగ, పుష్టిగా ఉన్నవారు దినిని పెడచెవిన పెట్టి తమ దారిలో వెళ్తూ, ధనానికి, అస్థిపాస్తులకు, దాసోహం అవుతారు. ఇక దైవాన్నే విస్మరించారంటే ఇక పొరుగువారిని, తోటివారిని ఎలా ప్రేమిస్తారు? ఎలా గౌరవిస్తారు? గౌరవించలేరు కాని కొంతమంది ధనవంతులు తాము మంచివారు అని పేరు తెచ్చుకొనుట కోసం. దేవాలయలకు, అధిక మోతాదులో దేవునకు సమర్పించుకుంటున్నాం అంటూ కపటం కలిగి జీవిస్తారు. దేవాలయం బయట ఉన్న బిక్షగాళ్ళకు ఒక్కరూపాయి కూడా ఇవ్వరు వీరిని గూర్చి యోహాను గారు ఇట్లు అనుచున్నారు. "కాని ఎవరైనను తాను దేవుని ప్రేమింతునని చెప్పుకొనుచు తన సొదరుని ద్వేసించినచో అట్టివాడు అసత్యవాది. తన కన్నులారా తాను చుసిన సోదరుని ప్రేమింపనిచో తానుచూడని దేవుని ఎటుల ప్రేమింపగలడు"? (1 యోహాను 4:20). ఎప్పుడైతే నేను, నాకు, నాతో, నా, నాది, అను గర్వమైన మాటలను వదలి మనము, మనది, మన, మనకు అను మాటలు వచ్చిన అప్పుడు మనము ప్రభువుకు ఇష్టమైన బిడ్డలుగ ఉండ గలము.

## సంపదలు పొందడం, ఆత్మను కోల్పోవటం

మానవుడు లోకమంతటిని సంపాదించి తన ఆత్మను కోల్పోయినచో ప్రయోజనమేమి? తన ఆత్మకు బదులుగా ఏమి ఈయగలడు? (మత్తయి 16:26). భూప్రపంచంలో ప్రతి ఒక్క మానవుని ధ్యేయం ఆరోగ్యంగ ఉండాలి, ఐశ్వర్యంగ ఉండాలి, సమృద్ధిగా ఉండాలి, చివరగ ఎటువంటి లోటుపాటులు లేకుండ కలకాలం జీవించాలన్నది మానవుని కోరిక ఇలా మంచిగ జీవించాలన్న క్రమములో కొన్నిసార్లు సక్రమైన మార్గం కాకుండ, అక్రమైన మార్గం చూసుకోవాటినికి ప్రయత్నిస్తారు. ప్రయత్నము ఫలించినట్లేతే అధిక మోతాదులో బ్యాంకులో ఉంచుకొని, తరతరాల కోసం దాచిపెడతం. దాని ద్వారా ఏమైన సాధించమా అంటే సాధించాము. కేవలం అది నిద్రలేని తనము, భయము, ఆశాంతి మొదలగునవి. సంపాదన కోసం ఈ లోకంలో మనిషి తనను సృష్టించి, పోషించి, పాలిస్తున్న, దేవుని వదలిపెడతారు. పునీత పౌలుగారు ఇలా

అంటున్నారు: "సృష్టికర్తకు బదులు సృష్టింపబడిన వస్తువును వారు పూజించి సేవించిరి" (రోమీ 1:25). మనిషి చేత సృష్టింపబడిన పచ్చనోటుకు ఇచ్చిన విలువ తనకు ఊపిరిని, జీవమునిచ్చిన ప్రదాతకు ఇవ్వలేక పోతున్నారు. తద్వారా దేవుడు ప్రసాదించు రక్షణను కోల్పోయి ఆత్మను నిత్య నరకాగ్నికి లోను చేస్తున్నారు. ధనవంతుడు తన కొరకే జీవిస్తాడు. అటువంటివారిని చివరిలో ప్రభువు ఏమి చేస్తారో మరియమాత తన స్తోత్రగీతంలో వివరించారు. "ఆకలిగొన్నవారిని సంతృప్తి పరచి, ధనవంతులను వట్టి చేతులతో పంపివేసెను (లూకా 2:53). నీ చుట్టూ ధనదాన్యరాసులు ఉన్నాయని మిరిసిపడకు, ఎంత ధనం ఉన్నా తినేది పిడికెడు మెతుకులే అని మరువకు.

## మానవ జీవితం ఒక యుద్ధం

మానవ జీవితం ఒక యుద్ధం. నీకు నువ్వే సైనం, రాజ్యం, సేనాదిపతి, చివరికి రాజు. నీ దగ్గర ఎంత సంపద ఉంటుందో అంత దండయాత్రలకు, దోపిడీలకు, గురౌవుతావు. నీ ధనం నిన్ను సకల అపదలనుండి కాపాడుతుంది అపోహలో ఉన్నరా! నీ దగ్గర ఉన్న సంపద కొన్నింటిని మాత్రమే జయిస్తుంది, అన్న కాని నీ దగ్గర ఉన్న సమృద్ధి వంశపారంపర్యంగ వస్తున్న జబ్బును అరికట్టలేదు ఆకస్మాత్తుగ జరిగే ప్రమాదాన్ని అడ్డుకొనలేదు. నీ గుండెను అగకుండ అపాలేదు, నీ ఆయుశీస్సును, శ్వాస, నిశ్వాసలను కొనలేదు. ఇంక ఎన్నో ధనం చేయలేనివి ఉన్నాయి. నీ దగ్గర ఉన్న సిరి సకల కలహాలకు, కొట్లాటలకు దారి తీస్తుంది.

బంధువులే రాబంధువులు అవుతారు.

స్నేహితులే శత్రువులు అవుతారు.

అన్నదమ్ములే ఆయువును అపే ఆయుధాలు ఆవుతారు.

కావాల్సిన వారే కాటికి పంపే కారకులు అవుతారు.

దగ్గరివారే దండయాత్ర చేస్తారు.

దీని కోసమా నేను ఇంత ప్రయాస పడేది? అని తెలుసుకొనే లోపే జీవితం, నిర్జీవం కావచ్చు. ఏ దినము, ఏ గడియో, ఎలా ఉంటాయో ఎవరికీ

ఒక పరలోక తండ్రి తప్ప. ఎల్లా వేళలా జాగరుకతో జీవితాన్ని పరీశీలించుకుంటూ ధనం కన్నా దైవానికి ప్రాముఖ్యత నిస్తే, నీ యుద్ధం నీవు కాదు చేసేది 'ఆయనే' దేవుడు మన పక్షమున ఉన్నచో ఇక మనకు విరోధి ఎవడు? (రోమీ 8:31). అలాకాకుండ అవివేకి అయిన ధనవంతుని లాగా లోభి తనముతో తనకు తాను సంపదలు కూడ బెట్టుకున్నచో ప్రభువు చెప్పిన రీతిలోనే 'ప్రాణములు కోల్పోవుదువు.'

## దేవుని దృష్టిలో బాగ్యవంతులు

దేవుని దృష్టిలో బాగ్యవంతువులు ఎవరు అని ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకున్నట్లైతే? "మీకున్న దానిని పేదలకు ఒసగుడు, అప్పుడు శుద్ధియగును" (లూకా 11:41) అంటుంది బైబిలు గ్రంథం. మీ ఆస్తులను అమ్మి దానము చేయుడు. మీ కొరకు చిరిగిపోని సంచులను సమాకుర్చుకొనుడు. మీ సంపదను పరలోకమున పదిలపరుచుకొనుడు. చెదపురుగులు తినివేయవు (లూకా 12:33). దానము చేసినప్పుడు మీ సంపదలు శుద్ధి అగును, రెండతలు పెరుగును. సారెఫతు విధవరాలు ఇంటా ఏలియా అద్భుతము చేసేను. అమెకు ఉన్నంతలో సహాయము చేయగా ప్రభువు, అమెను సమృద్ధిగా దీవించెను (1 రాజుల గ్రంధము 17:8-16). నీకు ఉన్న సంపదలలో "అడిగిన వానికి లేదనక యిమ్ము (మత్తయి 5:42). ఇవి అన్ని లోక వస్తువులు ఇంకొంచే ఆధ్యాత్మికంగ ముందుకు వెలితే తన స్నేహితుల కొరకు చివరకు తన ప్రాణమును దారపోయువానికంటే ఎక్కువ ప్రేమగలవాడు ఎవడును లేడు (యెహాను 15:13). ఇలా చేసిన వారే దేవుని దృష్టిలో భాగ్యవంతులు అవుతారు. ఎన్ని సంపదలు ఉన్ననూ ప్రభునికి సమర్పించుకొని, ఆయన ఆజ్ఞలను పాటిస్తు, సంపూర్ణమైన ప్రేమ కనబరిచి, ఆయనపై ఆధారపడి, రక్షణ కొరకై ప్రయాసపడే ప్రతి ధనవంతుడు, ప్రతి వ్యక్తి దేవుని దృష్టిలో భాగ్యవంతులు ఆవుతారు.

# 11. అంజూరపు చెట్టు

**– బ్రదర్ జుత్తుక వెళాంగని రాజ్**

## ఉపోద్ఘాతం



ప్రియమైన పాఠకులారా, మనం మన అనుదిన జీవితాలలో అనేకమైన జీవిత పాఠాలు వింటూ ఉంటాం లేక మన జీవితాలకు అన్వయించుకుంటు ఉంటాం. ఏ మతమైనా, ఏ జీవిత విధానమైనా సరే, జీవితం సార్థకం చేసుకొమ్మనే ప్రోత్సాహిత్సాయి. మరి ముఖ్యంగా క్రీస్తు ప్రభువు మార్గంలో నడిచే మనకి ఆయన అనేక విధాలుగా మంచి జీవితం జీవింప, బోధనలు చేస్తారు. అలాంటి అనేకమైన గొప్ప ఉపమానలలో ప్రాముఖ్యమైనది పునీత లూకాగారు తన సువిశేష గ్రంథంలో పొందుపరచిన “అంజూరపు చెట్టు” ఉపమానం.

## పునీత లూకా గారి యొక్క రచనాశైలీ

లూకా సువార్త గ్రంథ కర్తయైన పునీత లూకా గారు, పునీత పౌలునీ యొక్క సహచరులు. వీరు ఈ గ్రంథాన్ని సుమారు 80–110AD లో రచించారు. ఈ గ్రంథంలో క్రీస్తు ప్రభుని యొక్క జననం నుండి మోక్షరోహణం, తదుపరి సువార్త వేద ప్రచారం ప్రారంభం వరకు లిఖించారు. మరి ముఖ్యంగా ఈయన ఆ రోజులలో జీవిస్తున్న అన్యుల కోసమై దీనిని రచించారు.

## లూకా 13:6–9

ప్రభువు బోధించిన ఉపమానలకు ఎంత ప్రాముఖ్యత ఉన్నదో, అదే ప్రాముఖ్యత ఈ ఉపమానమునకు కూడ లభించింది. ప్రియ స్నేహితులారా, ఒక్కసారి మనం ఈ ఉపమానమును క్షుణ్ణంగా పరిశీలిస్తే, క్రీస్తు ప్రభువు,

ఫలించని ఒక అంజూరపు చెట్టును వ్రేళ్ళతో పెకలింపుము అని తోటమాలితో చెప్పటం, దానికి గాను ఆ తోటమాలి నాకొక సంవత్సరం గడువు ఇయ్యండి, నేను సరిచేసి ఫలింపచేలా చేస్తాను. అని విన్నవిస్తూ, "ఓపిక పట్టుడు" అని కోరాడు.

అసలు ఏమిటి ఈ అంజూరపు చెట్టు యొక్క ప్రాముఖ్యత? ఈ అంజూరపు చెట్టు దేనికి సూచిక లేక గుర్తు, దీనిని అలనాటి యూదులు ఏ విధంగా గుర్తించే వారో ఒక్కసారి పరిశీలించుదాం.

## అంజూరపు వృక్షం – ఆధ్యాత్మిక జీవన యాత్ర

అంజూరపు వృక్షం ఆదికాండం నుండి దర్శన గ్రంథం వరకు ఎంతో ప్రాముఖ్యతను ఆపాదించుకుంది. ముఖ్యంగా దీనిని ఇశ్రాయేలు జనావళికి ముఖ్య సూచికగా సరిపోల్చేవారు (యావేలు 2:21–25). అదే విధముగా ఈ అంజూరపు చెట్టు విజ్ఞానమునకు, విజయానికి సూచికగా కూడ ఉపయోగించేవారు. ముఖ్యముగా గ్రీకు దేశీయులు ఈ వృక్షాన్ని ఎంతో అమూల్యమైనదిగా పరిగణించేవారు. ఈ విధముగా ఈ అంజూరపు వృక్షం ఎంతో పేరు గడించింది మరియు ఆధ్యాత్మిక జీవనానికి మార్గం అయ్యింది.

## యూదులు ఏ విధముగ పరిగణించేవారు

యూదులు ముఖ్యముగా ఈ వృక్షాన్ని భద్రతకు మరియు సిరిసంపదలకు సూచికగా గుర్తించేవారు. కొన్ని సందర్భాలలో యాత్ర చేయువారు ఈ వృక్షం క్రింద సేదతీరి, తిరుగ ప్రయాణం చేసేవారు. మనం క్షుణ్ణంగా పరిశుద్ధ గ్రంథాన్ని పరిశీలిస్తే పూర్వ నిబంధన ప్రవక్తలు, అదే విధంగా క్రీస్తు ప్రభువు స్వయముగా అనేక పర్యాయములు ఈ అంజూరపు వృక్షాన్ని ఉదాహరణగా ఉపయోగించడం గమనించవచ్చు.

యిర్మీయా ప్రవక్త కూడ ఈ అంజూరపు పండ్లను మనుష్యుల యొక్క మంచి చెడు వ్యక్తిత్వాలతో సరిపోల్చారు. అంటే మానవులు దేవుని యొక్క ఆజ్ఞాలు పాఠించి, అలవంభన చేస్తే మంచి అంజూరపు పండ్లుగాను, ఒక వేళ దైవ మార్గన్ని విడచి స్వంత మార్గలలో పయనిస్తే చెడు అంజూరపు పండ్లు గాను అభివర్ణించాడు.

## అంజూరపు వృక్షం - వివరణ

### 1. విశ్వాసులు విజయం సాధిస్తారు / గెలుపొందుతారు

యిర్మీయా ప్రవక్త నుడివినట్లు విశ్వాసముతో దేవుని ఆజ్ఞలు పాటించి, ఆయనను సేవించువారు విజయాన్ని సాధిస్తారు మరియు దైవ దృష్టిలో పేరు గడిస్తారు.

### 2. శ్రీసభ యొక్క బోధనలు

తల్లియైన తిరుసభ మనలను దైవాజ్ఞలకు లోబడి జీవించుమని, దైవాన్నే మన శిరస్సుగా చేకొని, అంజూరపు వృక్ష ఫలాలుగా ఫలింపుమని ఆహ్వానిస్తుంది.

## శ్రీసభ దైవార్చనలో అంజూరపు వృక్షం

తిరుసభ మనకు ఈ అంజూరపు వృక్షం యొక్క ఉపమానాలను అనేక సందర్భాలలో పరిచయం చేస్తుంది. మరీ ముఖ్యంగా తపస్సుకాలంలో విరివిగా మనకు కనిపించు లేక వినుపించు ఉపమానం ఈ అంజూరపు వృక్షం యొక్క ఉపమానం. ఎందుకంటే క్రీస్తు ప్రభుని ఉత్థానంలో బాగస్థులం కావాడానికి నిరీక్షణ, ఓర్పు ఎంతో ముఖ్యం. దీనికి ప్రతీక అంజూరపు వృక్షం.

## క్రీస్తు ప్రభువు వర్ణించిన తీరు

క్రీస్తు ప్రభువు ఈ ఉపమానమును యూదా జాతి జనులకు ముక్కు సూటిగా ఉపదేశించారు. వివిధ పాత్రల ద్వారా ఈ ఉపమానం యొక్క వివరణను తెలియచేశారు. తండ్రి దేవున్ని తోట యాజమానిగా వర్ణించారు. తోటమాలిగా తనను తాను సరిపోల్చుకున్నారు మరియు వృక్షాన్ని యూదులకు అన్వయించారు.

క్రీస్తు ప్రభువు ఎన్ని బోధలు చేసినప్పటికీ యూదుల వైఖరీలలో ఏ మార్పులేదు. అందుకే ఆయన అంటారు, “నేను 3 సంవత్సరాల నుండి ఫలములకై వేచి చూస్తున్నాను, కానీ ఫలితం లేదు అని తండ్రి దేవుడు పలుకగా, నర రూప ధారియైన క్రీస్తు నాకొక సంవత్సరం గడువు ఇవ్వమని, తాను యూదులను ఫలించే వారినిగా చేస్తానని”, విన్నవించారు.

ఏమిటి ఈ ఫలించడం, అని మనం పర్యాలోచన చేస్తే, దేవుని నమ్మి, ఆయన బోధనలు ఆలకించి పాటించునపుడే ఫలిస్తాము అని దీని అర్థం. ఒక

వేళ అలా చేయకపోతే దైవ రాజ్యం నుండి వైదొలగి పోతాము. ఎలా అయితే యూదులు ఆ ప్రభుని మాటలు పెడత్రోవన పెట్టి, ఆ ప్రభుని సహితం ఎలా సిలువ వేసారో, మనం కూడ అలాగే తయారవుతాం.

**ముగింపు**

ప్రియమైన పాఠకులారా, మనం ఎప్పుడైతే ప్రభుని మాటలను ప్రక్కన పెట్టి, యూదుల వలే జీవిస్తామో, అప్పుడు దైవ శిక్షకు పాత్రులం అవుతాము. ఒక వేళ ప్రభుని మాటలను పాటించి జీవిస్తే నిజమైన క్రైస్తవులుగా నిలుస్తాం.

మరి, మంచి అంజూరపు ఫలలుగా ఫలించుటకు, దైవ మార్గంలో నడచుటకు, ప్రభుని అనుసరించుటకు తయారుగా ఉండటానికి ప్రయాసపడుదాం. క్రీస్తునిలో అధికముగా ఫలించుదాం.

❃ ❃ ❃ ❃

# 12. ఆవగింజ యొక్క ఉపమానం

- బ్రదర్ కసుకుర్తి జోసఫ్ తంబి

## 1. ఉపోద్ఘాతము



నూతన నిబంధనలు చెప్పబడిన ఆవగింజ ఉపమానము, యేసు క్రీస్తు తన ఇహలోక వేద ప్రచార సమయంలో అందించిన లోతైన వేదాంతపరమైన అంతర్దృష్టులు సూచిస్తుంది. ఈ ఉపమానమును మొదటి మూడు సువిశేషాలలో మనం గమనించగలము. (మార్కు 4:30-32, మత్తయి 13:31-32 లూకా 13:18-19). ఈ ఆవగింజను పోలినట్లే ఉపమానము కూడా చాలా చిన్నదిగా ఉండటం ఘమానర్హం. కానీ దాని లోతైన అర్థం అధిక విస్తరణకు ప్రతీక. ఇదే ఉపమాన ప్రత్యేకత. వేదాంత దృక్కోణం నుండి గమనిస్తే, ఈ ఉపమానం దేవుని రాజ్యం యొక్క చైతన్యవంతమైన రూపాంతర స్వభావాన్ని నొక్కి వక్కాణిస్తున్నది. విశ్వాస పెరుగుదల, దైవీక సూత్రాల విస్తృతమైన ప్రభావం మరియు విశ్వాసుల జీవితాలు, సమాజంలో సానుకూల పరివర్తనకు సంభావ్యత గురించి ఆలోచింపజేసే విధంగా ఉపమానం చెప్పబడింది. ఇంకొక లోతైన ఉద్దేశం మరియు దీనికి అనుసంధానమైన అర్థం ఏమిటంటే, పరలోక రాజ్యం గురించి వివరించి చెప్పడం. ప్రభువు పరలోక రాజ్యం వివరించుటకై విత్తనాలఅన్నింటిలో గల చిన్నదానని ఎంచుకున్నాడు. పరలోక రాజ్యం అంటే యేసుక్రీస్తు తన మహిమలో తండ్రి, పరిశుద్ధాత్మను సహవాసంలో వెనవేల కోట్ల దూతల సమూహములో స్వర్గము నుండి పరిపాలించడం కాదు. పరలోక రాజ్యం అనేది మన హృదయాల నుండి ప్రారంభమవ్వాలి. చిన్న విత్తనం ఉద్దేశం ఇదే. ఈ ఉపమానములో విశ్వాస పరివర్తన శక్తిని ప్రభువు వివరించారు.

ఆవగింజ చిన్నదైనను అది పెరిగి బలమైన చెట్టుగా మారుతుంది అలానే వినయ పూర్వకమైన ప్రారంభం నుండి దేవుని రాజ్యం యొక్క పెరుగుదల వర్ణనకు అతీతంగా అధిక విస్తరణలో జరుగుతూ ఉంటుంది. ఈ ఉపమానానికి అపోస్తలిక లేదా మరణానంతరజీవిత అస్తిత్వం కలిగి ఉంది.

## 2. సువార్త పటనములలో ఆవగింజ ఉపమనము

మార్కు సువార్త 4:32–33

30. యేసు మరల ఇట్లనెను: “దేవుని రాజ్యమును దేనితో పోల్చదగును? ఏ ఉపమానముతో దానిని వర్ణింపవచ్చును? 31. అది ఒక ఆవగింజను పోలియున్నది. అది భూమిలో నాటబడినపుడు, అన్ని విత్తనములకంటె చిన్నదైనను. 32. పెరిగి పెద్దదైనపుడు, మొక్కలన్నిటికంటే పెద్దదై, కొమ్మలతో, రెమ్మలతో ఒప్పుచుండును. ఆకాశపక్షులు దాని కొమ్మలలో గూళ్ళుకట్టుకొని నివసించును.

మత్తయి సువార్త 13:31–32

31. ఆయన మరియొక ఉపమానమును ఇట్లు వారితో చెప్పెను: “పరలోకరాజ్యము పొలములో నాటబడిన ఒక ఆవగింజను పోలియున్నది. 32. అన్ని విత్తనముల కంటె అతి చిన్నదైనను, పెరిగినపుడు అది పెద్ద గుబురై, వృక్షమగును. దాని కొమ్మలలో పక్షులు వచ్చి గూళ్ళు కట్టుకొని నివసించును.”

లూకా 13:18–19

18. ఆయన–దేవుని రాజ్యము దేనిని పోలియున్నది? దేనితో దాని పోల్తును? 19. ఒక మనుష్యుడు తీసికొనిపోయి తన తోటలోవేసిన ఆవగింజను పోలియున్నది. అది పెరిగి వృక్షమాయెను ఆకాశపక్షులు దాని కొమ్మలయందు నివసించెననెను.

## 3. చారిత్రక నేపథ్యం

యేసు తన బహిరంగ పరిచర్య సమయంలో ఆయన అనేక బోధనలకు గలిలీయ ప్రాంతం ప్రముఖ ప్రదేశం. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా విచ్ఛిన్న

జనాభాతో గుర్తించబడుతుంది మరియు ఆవగింజ మొక్కల పెంపకంలో సహా వ్యవసాయం ఒక సాధారణ పద్ధతి. ఆవగింజ దాని చిన్న పరిమాణానికి ప్రసిద్ధి చెందింది మరియు అది నాటబడిన తరువాత అతి పెద్దగా పెరుగుతుంది ఈ సుపరిచితమైన చిత్రీకరణతో యేసు తన ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. వీటిని ఉపయోగించి వారి వీనులలో మరలా మరలా ప్రతిధ్వనించేటట్లుగా లోతైన ఆధ్యాత్మిక సత్యాలను తెలియజేశాడు. ఆనాటి పాలస్తీన, గలీలీయ ప్రాంతాలలో 27-30 క్రీ.శ. కాలంలో సామెతలలో కూడ ఆవగింజను వాడటం జరిగేది. పెరుగుదల లేదా చిన్నది, పెద్దది అనే వ్యత్యాసాలను చూపించే వస్తువుగా ఆవగింజను పరిగణించేవారు పాత నిబంధనలో కూడా ఈ ఉపమాన అర్ధాన్నిచ్చే సాదృశ్యాలు కనబడతాయి.

**బైబిలు నుండి చారిత్రక ఉదాహరణలు**

i. దావీదు మరియు గొల్యాతు (1 సమూయేలు 17):

దావీదు యువ గొర్రెల కాపరి. అందులో చిన్నవాడు తాను కేవలం విశ్వాసము అనే ఆయుధంతో రణరంగంలోనికి దిగాడు. అతిశక్తివంతుడైన ఆజానుబాహుడైన గొల్యాతును ఓడించాడు ఈ సన్నివేశం చిన్న ప్రారంభం. పెద్ద ప్రయోజనాన్ని కలిగించడానికి ఉదాహరణగా నిలుస్తుంది ప్రభువు చెప్పే ఉపమాన అర్ధరీతి కూడా ఇదే.

ii. అపోస్తులల చర్యలలో క్రైస్తవ మతవ్యాప్తి:

ఆదిమ క్రైస్తవ సంఘపు పెరుగుదల, ప్రభావం అపోస్తుల చర్యలు లికించబడింది. ఆదిమ సంఘం ఆనాటి సమాజంలో చిన్న సంఘం అయినప్పటికీ, దాని విస్తరణ చాలా ఎక్కువగా జరిగింది 2000 సంవత్సరాలు దాటినప్పటికీ దాని ప్రభావం ఇప్పటికీ ఉంది.

## 4. ఉపమానంలో చెప్పబడిన వస్తువుల పోలికలు - సాదృశ్యాలు

వేదాంత పండితులు ఉపమానంలో యేసు ఉపయోగించిన వస్తువులు, స్థలాలు, వ్యక్తులు లేదా ప్రాణులు ఏయే అర్థాలను సూచిస్తున్నాయో చెబుతున్నారు.

i. విత్తనం – ఆవగింజలు సువార్తతోను లేదా స్వయాన యేసు ప్రభుతో పోలుస్తారు.
ii. భూమి లేదా తోటను ప్రపంచాన్ని సూచించే విధంగా ఉపమానంలో చెప్పబడిందని పండితుల అభిప్రాయం.
iii. విత్తనం పెరిగి పెద్దయ్యాక మహావృక్షంగా మారేది స్వర్గలోకం లేదా దేవుని రాజ్యం లేదా శ్రీసభను పోలుస్తూ చెబుతున్నారు.
iv. పక్షులను దేవదూతల, పునీతుల సమూహాలతోను, ఉన్నతమైన క్రైస్తవ జీవితం జీవించి ఆత్మలతో పోలుస్తున్నారు.

## 5. వివిధ కతోలిక ఆదిమ గురువుల బోధ: Church Fathers

### 1. పునీత జెరోమ్

పరలోక రాజ్యం అంటే సువార్త బోధ మరియు జీవనానికి దారితీసే లేఖనాలజ్ఞానం దాని గురించి యూదులతో ఇలా చెప్పబడింది: ఆవగింజతో పోల్చబడిన పరలోక రాజ్యం లేదా దేవుని రాజ్యం మీ నుండే తీసుకొనబడింది (మత్తయి 21:43). ఈ ఆవగింజను విత్తే వ్యక్తి విశ్వాసుల మనస్సులలో 'సువార్త' అను విత్తనాన్ని విత్తే రక్షకుడని తెలుస్తుంది. సువార్త బోధ అనేది చాలా ప్రారంభం మిడి మిడిగా జరిగింది. యేసు అనే నామధేయం ధరించిన వ్యక్తిని దేవుని కుమారుడిగా ప్రకటించడం, దేవుడు తనకు అప్పగించిన పనిలో మరణ శిక్ష ఒక భాగం కావడం అంత అర్థవంతంగా మొదటిలో కనిపించలేదు. ఈ దైవ కుమారుని గూర్చి బోధలను తత్వవేత్తల సిద్ధాంతములతో వారు పుస్తకాలలో వారు వాక్చాతుర్యం యొక్క వైభవంతో, వారి శైలి యొక్క మెరుగులతో పోల్చి చూస్తే ఆ ఆలోచనలకు కూడా ఈ మాటలు సరితూగవు. కానీ ఈనాడు సువార్త వ్యాప్తి ఎంతగానో జరిగింది. ఆనాడు నాటిన చిన్న విత్తనం నేడు మహావృక్షమై ఎంతోమందికి ఆశ్రయిస్తుంది, ఓదార్పునిస్తుంది. సువార్తను బోధించడం మొదట్లో చిన్నదిగా అనిపించినా, వినే వారి మనస్సులను రంజింప చేసే ఆ సువార్త తర్వాత కాలంలో ఎందరో తత్వ శాస్త్రవేత్తలను అబ్బురపరిచింది. ఇది ఓదార్పునిచ్చే మూలికగా, సంతోషాన్ని నింపే శక్తిగా ప్రజల మనసులలో నిలిచింది.

**2. పునీత అగస్తీను**

ఉపమానంలో చెప్పబడిన ఆవగింజ విశ్వాసులను తొట్రిల్లకుండా చేసే విశ్వాస బీజం. ఇది సైతానుకు, విషానికి సైతం ఎదురు నిలవగలదు. దీనినే వ్యవసాయి అనే తండ్రి ఈ లోకములో క్రీస్తు అను విత్తనమును, ప్రపంచము అనే పొలములో నాటారు.

**3. పునిత హిల్లరీ పోయితెరస్**

ఉపమానంలో పోలికగా చెప్పిన ఆవగింజతో ప్రభువు క్రీస్తు తనను తాను పోల్చుకుంటున్నారు. రుచికి ఎంత అవసరమైనది మరియు అన్ని విత్తనాలలో చిన్నది అయిన ఈ గింజబలం అది నలిగి భూమిలో నశించడం ద్వారానే బయటపడుతుంది. క్రీస్తు ప్రభువు జీవిత సారాంశం కూడా ఇదే. విరిగి, నలిగి నశించి, మరలా జీవమంతుడై రక్షణ ఆనందాన్ని, పరలోక రాజ్య రుచిని ఆవగింజ వలె తెలిపేవారే క్రీస్తు ప్రభువు. అందుకే తనను తాను ఆవగింజతో పోల్చుకున్నారు. ఈ విత్తనం పొలంలో విత్తినప్పుడు అంటే ప్రజలు మతాధికారుడు ఆయన మరణానికి అప్పగించడానికి స్వాధీనం చేసుకున్నప్పుడు మరియు శరీరాన్ని భూమిలో మరణం తర్వాత విత్తినప్పుడు, ప్రవక్తలు ప్రబోధించిన ప్రవచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. తద్వారా క్రీస్తు శక్తి బయటకు వెలువడి అపోస్తులను నడిపించింది. ఇప్పుడు వారు విస్తరింప చేసిన చెట్టు కొమ్మలలో ఎంతో మందికి ఆదరణ, ఆశ దొరుకుతూ ఉన్నాయి.

**4. పునీత గ్రిగోరి**

ఉపమానంలో చెప్పబడిన రీతిన ఆవగింజ స్వయంగా క్రీస్తు ప్రభువే. ఆయన మరణం ద్వారా సమాదిలో అనగా (భూమిలో/తోటలో) నాటబడిన వృత్తనం వంటి వాడు, ఆయన మరలా మహిమతో లేచినప్పుడు అతనికి అనంత ఘనత, శక్తి ఒక పెద్ద మహావృక్షంగా బట్టబయలవుతుంది. పవిత్రమైన జీవితాన్ని జీవించిన ఎన్నోఆత్మలకు, తమ కష్టాలలో ఓదార్పు నిచ్చే ఆశ్రయంగా మారుతుంది.

**5. పునీత జాన్క్రిసొస్తం**

ఉపమానంలో చెప్పబడింది సువార్త అను ఆవగింజ గురించి. అది ఇప్పుడు

ప్రపంచమంతా వ్యాప్తి చెందింది. దానిని ఈ లోకానికి పరిచయం చేసిన వారు క్రీస్తు ప్రభువును శిష్యులు. మీరు ప్రపంచమంతా వెళ్లి సకల జాతి జనులకు బోధించండి అని ప్రభువు ఇచ్చిన ఆజ్ఞలను ఈ లోకంలో వారు వేదజల్లారు/విత్తారు. ఆ ఆవగించే ఇప్పుడు మహావృక్షంగా మారింది. అన్ని వృక్షాలలో కన్నా ఎక్కువ పక్షులకు ఆదరణ నిచ్చే ఆశ్రయమిచ్చే వృక్షంగా మారింది. అది సువార్త యొక్కబలము, శక్తి మహిమ.

## 6. వేదాంత దృక్కోణం

ఆవగింజ ఉపమానం, యేసు బోధించిన బోధనలోకెల్లా చాలా చక్కగా సాదృశ్యాలతో చెప్పబడినది. చిన్న ప్రారంభమైనప్పటికీ ఎక్కువ ప్రభావం అనే అంశం చుట్టూ కేంద్రీకృతమై లోతైన వేదాంత సందేశాన్ని అందిస్తుంది. విశ్వాస పరివర్తనాశక్తి, సమకాలీన ప్రపంచంలో లోతైన వేదాంత అర్థాలను ఇచ్చే భావం, మరియు శాశ్వతమైన ఔచిత్యంలో ప్రతిధ్వనించే దేవుని రాజ్యవిస్తరణ గూర్చి అంతర్దృష్టులను అందిస్తుంది. యేసు క్రీస్తు విశ్వాసం గురించి వివరించిన దృష్టాంతములలో ఈ ఉపమానాన్ని పేర్కొన్నారు. మనం దీని వేదాంతాన్ని అర్థం చేసుకునే ముందు ముందుగా ఆవగింజ వంటి విశ్వాసం ఏమిటో మరియు అది దేనిని సూచిస్తుందో తెలుసుకుందాం.

### ఆవగింజంత విశ్వాసం

క్రైస్తవ మార్గాలలో లేదా పదకోశంలో మన వినే అత్యంత సాధారణ పదాలలో ఆభగించ విశ్వాసం ఒకటి దాని అర్థం ఏమిటి అని గ్రహించుటకు ముందుగా యేసు మాట్లాడిన మరో రెండు వచనాలను చూద్దాం.

లూకా 17:6 "మీకు ఆవగింజంత విశ్వాసమున్నచో, ఈ కంబళి చెట్టును 'వేరుతో పెల్లగిల్లి సముద్రములో నాటుకొనుము'అని ఆజ్ఞాపించిన అది మీకు లోబడును."

మత్తయి 17:20 యేసు వారితో "మీ అల్పవిశ్వాసమే అందుకు కారణము, ఆవగింజంత విశ్వాసము మీకుండినయెడల ఈ పర్వతముతో 'నీవిక్కడ నుండి తొలగుము' అని పలికినచో అది అప్పుడే తొలగిపోవును. మీకు అసాధ్యమైనది ఏదియు ఉండదని మీతో వక్కాణించుచున్నాను." ఈ రెండు వచనాల నుండి

మనకు అర్థమయ్యే భావం విశ్వాసంతో మనము ఏదైనా సాధించగలం అది మెల్లగా ప్రారంభమై పెరిగి అధికముగా విస్తరిస్తుంది.

**ఆవగింజ మరియు దాని సూచన**

స్వర్గ రాజ్యం లేదా దైవ రాజ్యం పరస్పరం బైబిలు గ్రంధములో ఉపయోగించబడ్డాయి "స్వర్గరాజ్యం" అని మత్తయి సువార్తికుడు వాడటంలో అంతరార్థం ఏమిటంటే తాను రాసే చదవురులకు ఇంపుగా అనిపించుటకు. "స్వర్గరాజ్యం"అనునది అతని సొంతమాట కాకపోవచ్చు కీర్తనలతో చెప్పబడిన ప్రకారము ముత్తయి ఉపయోగించివుండవచ్చు.

కీర్తన 10:16 ప్రభు కలకాలం రాజుగా ఉండును అన్యజాతి వారు ఆయన దేశమున నశించురు.

కీర్తన 29:10 ప్రభువు ప్రళయ జలముల మీద సింహాసనం ఆసీనుడాయెను ఆయన కలకాలం రాజుగా ఉండి పరిపాలనము చేయును.

అయితే యేసు బోధించినది ఇక్కడ భూమిపై నెలకొని ఉన్న దైవరాజ్యం గురించి సూచిస్తున్నారు. అతడు దీనిని స్థాపించుటకు ఆపై రాజుగా పరిపాలించుటకు పంపబడ్డారు. విశ్వాసుల కుటుంబం/దేవుని ప్రజలు లేదా అతని శ్రీ సభ అనేవి దేవుని రాజ్యం. ఆవగింజ తన రాజ్య స్థాపనను సూచిస్తుంది. ఈ రాజ్యం 12 మంది శిష్యులతో ప్రారంభమైనది. ఎవరెవరైతే ఈ ఆవగింజను పోలిన విశ్వాసముతోనైనా, ప్రభువు అనుచరునిగా అనుకరిస్తే వారంతా దేవుని రాజ్య సభ్యులే.

**7. వేదాంతపరమైన ఆలోచన**

దైవ రాజ్యాన్ని వివరించడంలో ఆవగింజ అను చిన్న విత్తనం చాలా పెద్ద చెట్టుగా ఎలా పెరుగుతుందో అనే విషయాన్ని విపులీకరించారు. నిజమైన మరియు ఖచ్చితమైన విశ్వాసం అనే అతి చిన్న విత్తనం, గణనీయమైన పరివర్తనను, విస్తరణను పెంపొందించగలదనే వేదాంత సూత్రాన్ని ఈ ఉపమాన మనకు ఎరుక పరుస్తుంది. తద్వారా విశ్వాసిలో దేవుని రాజ్యము వర్ధిల్లడానికి సోపానం అవుతుంది. వేదాంత దృక్కోణం నుండి ఆలోచిస్తే ఈ

ఉపమానం నిజమైన ఖచ్చితమైన చిన్నపిల్లల స్వభావం లాంటి విశ్వాసాన్ని గూర్చి తెలియుజేస్తుంది. అకారణంగా అనిపించే ప్రారంభాలను అంగీకరించడంలో, దేవుడు మన చిత్తశుద్ధిని, స్వచ్ఛతకు విలువ ఇస్తారని మన విశ్వాస రూపకంగా ఈ ఉపమానం చెప్పబడింది. అలానే విశ్వాసులకు, వినయ పూర్వకమైన మరియు నమ్మకమైన విశ్వాసాన్ని/ఖచ్చితమైన విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సవాలు చేస్తుంది. దేవుని చేతిలో ఎంత చిన్న ప్రారంభములైన నిజముగా లోతైన ఆధ్యాత్మిక వృద్ధిని, ప్రభావాన్ని కలిగిస్తాయని ఈ ఉపమానం మనకు తేట తెల్లం చేస్తుంది.

## 8. ఉపమాన విపులీకరణ

చిన్న విత్తనం ఎలా అయితే మహావృక్షం అవుతుందో, ఆదేవిదముగా మనమే ఆ విత్తనం మనం ఎంత గొప్పగా ఎదిగి పెరిగి పెద్దనీడ నిచ్చే చెట్టుగా మారి ఎంతోమందికి దీవెనగా మారగాలం అను మొదటి సత్యమును ఉపమానం తెలియజేస్తుంది. మనము విత్తనము లాంటివారము చిన్నవారము లోకం దృష్టిలో ఎందుకు పనికిరాని వారమైన మనలను ప్రభువు ఎన్నుకుంటారు. విత్తనంలో ఉన్న వ్యక్తి చెట్టులా మారాలి అంటే ప్రభువు మనల్ని ఎలా చూస్తూ ఉన్నారో ఆ దృష్టితో పరులను మనం కూడా చూడటం మొదలు పెట్టాలి. 1 సమూయేలు 16:7 లో చూస్తూ ఉన్నాం, సమువేలు ప్రవక్తను దేవుడు ఈషాయి కుటుంబం దగ్గరికి పంపించారు. సమూవేలు ఇంటిలో ఎత్తైన మనిషిని చూసాడు ఆయననే కాబోలు దేవుడు రాజుగా ఎన్నుకుంటున్నాడని అనుకున్నాడు వెంటనే తైలాన్ని తీసి అభిషేకించాలి అని తన మదిలో మెదిలిన వెంటనే దేవుడు సమువేలుతో ఈ విదముగా చెబుతున్నారు, "నేను ఎన్నుకొనిన నా సేవకుడు ఇతడు కాడు," అని అలా ఐదుగురు పిల్లల విషయంలో జరిగింది వారందరిని యావే నిరాకరించారు. అప్పుడు సమువేలు ఇంకా నీ కుమారులు ఉన్నారా అని ప్రశ్నించాడు? అప్పుడు ఈషాయి "ఉన్నాడండి కానీ ఆయన అడవిలో గొర్రెలు కాస్తూ ఉన్నాడు" ఇక దేనికి తాను పనికిరాడనే ఉద్దేశంతో సమాధానమిచ్చాడు ఇదే విధంగా కొన్నిసార్లు మనల్ని మనమే తక్కువ అంచనా చేసుకుంటాం. లేదా ఇతరులను తక్కువగా చేసి హేళన చేస్తాం. కానీ ప్రభువు మనల్ని చూసిన

విధముగా ఇతరులను మనం చూడలేము. ఈ సందర్భంలో సొంత తండ్రి కుమారుని గూర్చి అలా చెబుతూ ఉన్నాడు కాని దేవుడు సమూవేలుతో ఇలా చెబుతున్నారు. 1 సమూయేలు 16:7. కాని యావే "ఇతని రూపమును, ఎత్తును చూచి భ్రమపడకుము. నేను ఇతనిని నిరాకరించితిని. దేవుడు నరుడు చూచిన చూపుతో చూడడు. నరుడు వెలుపలి రూపును మాత్రమే చూచును. కాని దేవుడు హృదయమును అవలోకించును" అని చెప్పెను.

మానవుడు హృదయాంతరంగాలను ఎరుగలేడు కేవలం బాహ్యబలం చూస్తాడు ఈ తరుణములో దేవుడు పాలిన మాట ఇదిగో ఆ వ్యక్తిని నేను నా సేవకునిగా ఎన్నుకుంటున్నానని పలుకుతున్నారు. వెంటనే ఆ గొర్రెల కాపారిని సొంత తండ్రి చే హేళన చేయబడిన ఆ వ్యక్తిని దేవుడు ఎంచుకున్నారు. ఈ లోకంలో మనల్ని కూడా మనం అనేకసార్లు ఎవరైనా హేళన చేసినట్లయితే భయపడక తోట్రిల్లక దేవుడు నిన్ను ప్రత్యేకంగా ఎంచుకున్నాడని భావంతో ముందుకు సాగాలి. ఇంకొక తరుణంలో మొదటి సమూయేలు 17:33 లో సౌలు దావీదుతో నీవు చిన్నవాడవు గొల్యాతు చాలా బలమైన వ్యక్తి, ఎంతో మంది సైన్యము ఉన్ననూ ఆయన ముందు నిలువలేకపోతున్నారు, నీవేం చేయగలుగుతావు అని ప్రశ్నించాడు. సౌలు రాజు కూడా దావీదు లో ఉన్న ప్రభువు ఎన్నికను చూడలేకపోయాడు. కానీ ఎవరు మనలో ఉన్న సామర్థ్యాన్ని చూడలేకపోయినా దేవుడు ఒక జీవితానికి ఒక ప్రణాళికను సిద్ధం చేసే వున్నారు అనే సత్యాన్ని మనం గ్రహిస్తే మనం ఒక మహా వృక్షంలో మారుతాం. అలా వృక్షములా మారి, అనేక మందికి దీవెనకరంగా మెలుగుతాం. దావీదు విషయంలో కేవలం తన తండ్రి, ప్రవక్త మాత్రమే కాదు గొల్యాతు కూడా హేళన చేస్తూ మాట్లాడుతున్నాడు. నేనేమైనా చిన్న కుక్కనా? రాళ్లతో వస్తున్నావు. నన్ను ఓడించుటకు ఎంత సాహసించావు? కానీ దావీదు చెబుతున్నాడు నీవు ఈటితోను ఇతర ఆయుధములతోనూ ఈ లోకమునకు చెందినటువంటి ఆయుధాలతోను వస్తున్నావు కానీ నేను సజీవుడైన దేవుని హస్తముతో ఆయన బాలముతో ఆయన నా మమున వస్తూ ఉన్నాను అని చెప్పి ఒక చిన్న రాయితో శత్రువు అయిన గొల్యాతును ఓడించాడు దావీదు.

మనం దేవుని దృష్టిలో పడితే, మనలో శక్తి సామర్థ్యాలు అధికమవుతాయి. శత్రువులను జయించే శక్తిని దేవుడు మనలో ఉంచుతారు అనే నమ్మకముతో మనం ఉంటే దేవుడు మనల్ని విజయవంతులను చేస్తారు. ఎవ్వరూ దావీదు లోని సామర్థ్యం గ్రహించకపోయినా దేవుని దృష్టిలో దావీదు తనను తాను చూసుకున్నప్పుడు ఆయన తనశక్తిని గ్రహించాడు. మన దైనందిన జీవితంలో ఎవరు ఎంత చిన్నచూపు చూసిన, మనము దేవుని దృష్టి కలిగి ఆ చిన్న రాయి అనే (విశ్వాసాన్ని) మనం తీసుకుని వెళితే మనదే జయము. ఇక మూడవదిగా ఒక విత్తనం చెట్టుగా మారాలి అంటే ఒక వ్యక్తి ఆ విత్తనాన్ని తీసి భూమిలో నాటాలి అది స్వయంగా తనను తాను విత్తుకోలేదు ఎదగలేదు. ఒక మనిషి మంచి పొలంలో నాటాలి. ఆ వ్యక్తే దేవుడు. మనందరినీ మన కుటుంబం అనే పొలంలో మనల్ని నాటాడు. ఎందుకంటే మన ద్వారా మన కుటుంబ సభ్యులు ఇరుగుపొరుగువారు నీడను పొందాలని, మన ద్వారా రక్షణను పొందాలని మనం నాటబడి ఉన్నాం. ఈ నాటబడిన విత్తనం దేవుని హస్తం మీదుగా వెత్తబడితే మహావృక్షముగా మారుతాము. స్వయంగా విత్తనం తనకు తానే పెద్ద నీడనిచ్చే చెట్టుగా మారలేదు. కేవలము ప్రభు సహాయంతో మాత్రమే సాధ్యమవుతుంది. ఆయన మాత్రమే మనల్ని మార్చుగలడు అన్న సత్యాన్ని మనకు తెలుసుకోవాలి. ఇక నాలుగోదిగా ఒక విత్తనం చెట్టుగా మారాలంటే కొన్ని రోజులు ఓపికతో మౌనం వహించాలి మనం కూడా ఈ లోక అలజడలకు సడలక, ఓపికతో ప్రభువు చేతలకు అంతయు అప్పజెప్పి నిరీక్షణతో ఉండాలి. దేవుడే తన సేవకుడిని తప్పక గెలిపిస్తారు.

## 9. ఉపమానం చిన్ని ఆవగింజను పోల్చి చెప్తున్నప్పటికి దాని నుంచి మనం నేర్చుకోవాల్సిన పాఠాలు చాలానే ఉన్నాయి.

### 1. దైవరాజ్య స్వభావం:

యేసుక్రీస్తు పరలోక రాజ్యం గురించి వివరించుటకై మరియు ఎలా దైవరాజ్యం చిన్న ప్రారంభం నుంచి దాని విస్తరణ అంతుపట్టలేనిదిగా మారుతుందో తెలియచేయుటకు ఈ ఉపమానాన్ని బోధించారు. కొన్ని సార్లు దైవ రాజ్య విస్తరణ అనేది మన కంటికి విస్తరిస్తున్నట్లుగా కనిపించకపోయిన

చివరికి ఆ విస్తరణ ఫలితం మనల్ని ఆశ్చర్యచికతులను చేస్తుంది. ఈ ఉపమానం "చేరిక" అను అంశాన్ని కూడా తెలియజేస్తుంది. దేవుని రాజ్యంలో అందరికీ చేరిక లభిస్తుందని దీని భావం. ఆవగింజ చెట్టు అయినప్పుడు ఎలా అయితే, చాలా పక్షులకు నివాసము ఏర్పరచుకునే లాగా ఉంటుందో, ఆదేవిదముగా దైవరాజ్యం కూడా అంతే శరణు కోరిన ప్రతిఒక్కరికి దైవరాజ్యంలో చేరిక లభిస్తుంది. అసమానతలకు, పక్షపాతాలకు తావులేదు అని నొక్కి వక్కాణిస్తుంది.

### 2. విశ్వాస బలం

దేవుని రాజ్యను గురించే కాక ఆవగింజ ఉపమానంవిశ్వాసం గూర్చి చర్చించడానికి కూడా తోడ్పడుతుంది. ఆవగింజను ఎలా అయితే భూమిలో నాటి దానికి అన్నీ వనరులను సమకూర్చి, సదుపాయములు చేసి దానిని ఒక పెద్ద చెట్టుగా తోటమాలి చేస్తాడో, ఆదేవిదముగా విశ్వాసాన్ని కూడా అపురూప విశ్వాస బీజాల ద్వారా నాటి అందులో ఎదుగుతూ విశ్వాసపాత్రునిగా జీవిస్తూ, ఎలా అయితే ఆవచెట్టు ఎన్నో పక్షులకు ఆశ్రయం అవుతుందో, మన విశ్వాస జీవితం కూడా అనేక మందికి ఆదర్శంగా నిలవాలి. తద్వారా సువార్త ప్రకటనలు మనం కూడా భాగస్తులము అవుతాం.

### 3. దైవ బలం

ఆవగింజ ఉపమానం దేవుని మహాఅద్భుతమైన శక్తి మన జీవితాలలో ఎలా రూపుదిద్దుకుంటుందో, ఎలా మనల్ని నడిపిస్తుందో కూడా తెలియజేస్తుంది. ఒక చిన్న విత్తనం నుంచి అంత చెట్టును చేయగల దేవుడు, తన మహా అనంత ప్రేమలో తన బలాన్ని ఉపయోగించి మనల్ని అపురూపంగా తనకు దగ్గరగా ఉండేవారినిగా మలుచుకోలేడా? మలుచుకోగలడు కానీ, అది మన మీద ఆధారపడి ఉంటుంది. పునీత అగస్తీను గారు పలికిన విదముగా "మన ప్రమేయం లేకుండా మనల్ని సృజించిన దేవుడు మన ప్రమేయం లేకుండా మనల్ని రక్షించలేడరు." అందుకే దైవభలం అనే బీజాన్ని మనలో నాటే ప్రయత్నం దేవుడు పూనుకున్నప్పుడు మనం దానికి స్వస్తి చెప్పక ఎదురేగి ఆహ్వానం పలుకుతూ ప్రభువు బలంలోనే శరణు కోరాలి. మరొక విషయం ఏమనగా దేవుడు చిన్న చిన్న సంఘటనల ద్వారానే అతని ప్రణాళికలను మనకు

తెలియజేస్తారు. సమాజంలో అంతస్తులో ఉన్న వారి ద్వారా కాక, చిన్న చూపు చూడబడే వారి ద్వారా కూడా తన చిత్తాన్ని ఎరిగిస్తారో. మనం కేవలం మన విశ్వాసంలో నమ్మకము వుంచి ప్రభువు చిత్తాన్ని ఆలింగనం చేసుకోవాలి. ఎందుకంటే వినయ పూర్వకమైన ప్రారంభం ద్వారా మొదలయ్యే దేవుని కార్యాలు మన ఊహాశక్తికి అందనంత ఎదుగుతాయి, ఫలిస్తాయి. మనతో కలిపి మన తోటి వారికి కూడా ఆశీర్వాదంకారముగా వుండునట్లు దేవుడు దీవిస్తారు.

❃ ❃ ❃ ❃






## భక్త యోహాను ప్రచురణలు

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం

రామంతపురం, హైదరాబాదు - 500 013. ఫోన్ : 91-040-29561761, 29561762

e-mail: stjohnshyd2@gmail.com | www.stjohnseminaryhyd.org

Printed at : Jeevan Institute of Printing